ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శుక్రవారం 23 ఫిబ్రవరి 2024





కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం



కొల్లిపర మండలంలో ఒడ్డు వెంటే నీరు బయటకు వచ్చేలా 11 అడుగుల పైగా లోతులో ఇసుక తవ్విపోస్తున్న చిత్రం

ఇసుక.. మస్కా

- తవ్వకాలు ఆగిందే లేదు
- అడ్డే లేకుండా అక్రమాలు
- బ్యారేజీకి దిగువన రెట్టింపైన తవ్వకాలు
- కలెక్టర్ల పర్యటన తర్వాత మరింత విచ్చలవిడిగా..
- నేటికీ అమరావతి, అచ్చంపేట, క్రోసూరుల్లో క్వారీయింగ్
- యంత్రాలు వినియోగించడం లేదని అబద్ధపు నివేదికలు
- ఉపగ్రహ చిత్రాలను అందించి కౌంటర్ ఇచ్చిన కమిటీ

గుంటూరు, తెనాలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ కొరడా ఝళిపించిన, స్వయానా జిల్లా కలెక్టర్లే రీచ్‌లపై దాడులు చేసినా, ఇసుక అక్రమ తవ్వకాలు మాత్రం అడ్డుకట్టే పడలేదు. యంత్రాలతో తవ్వకూడదని, భారీ వాహనాలను నదిలో దింపకూడదనే నీటి ప్రవాహాలకు దగ్గరలో కాని నీరు బయటపడేంతగా కానీ ఇసుక తవ్వకూడదనే నిబంధనలను, వాల్టా చట్టం ఆదేశిస్తున్న ఎక్కడా నిబంధనలు అమలుకే నోచుకోకుండా పోతోంది. భారీ యంత్రాలు పెట్టి పది నుంచి 15 అడుగుల లోతు తీస్తూ ఇసుకను తవ్వేస్తూ భూగర్భ జలాలకు ముప్పు ఏర్పడేలా చేస్తుంటే మరోపక్క అనుమతులు ఒక చోట ఉంటే వారి ఇష్టం వచ్చిన తవ్వేస్తూ అడ్డగోలు ఇసుక క్వారీయింగ్‌కు తెగబడుతున్నారు. ఇంత దారుణాలు ఇసుక రీచ్‌లలో బహిరంగంగానే జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు శాఖలు కానీ హద్దులు నిర్ణయించి తవ్వకాలు పర్యవేక్షించాల్సిన మైనింగ్ శాఖ కానీ కన్నెత్తి కూడా చూడటం లేదంటే అధికార పార్టీ నేతల దందా ఏ మేర కొనసాగుతుందో అర్థమవుతుంది. ప్రకాశం బ్యారేజీ దిగువన గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కేవలం మూడు చోట్లే ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇస్తే మరో ఆరుచోట్ల అనధికారికంగా తవ్వకాలు జరిపిస్తున్నారు. పాతూరు, పెదకొండూరు, వల్లభాపురం, మున్నంగి, బొమ్మువానిపాలెం, గాజుల్లంక, జువ్వలపాలెం, పెనుమూడి రేవుల దగ్గర ఇసుకను విచ్చవిడిగా తవ్వేస్తున్నారు. ఇటీవల రెండు జిల్లాల కలెక్టర్లు కొల్లూరు మండలం జువ్వలపాలెం, కొల్లిపర మండలంలో రీచ్‌లను పరిశీలించిన సంగతి తెలిసిందే. కలెక్టర్ వచ్చిన సమయంలో కొన్ని గంటలు మాత్రమే ఇసుక తవ్వకాలు నిలిపి వేసి రీచ్‌ల నుంచి కలెక్టర్‌లు అడుగు బయట పెట్టిన వెంటనే మళ్లీ అక్రమ తవ్వకాలను యధావిధిగా కొనసాగించారు. ఎక్కడా ఆపిన దాఖలాలే లేవు. తాజాగా మరో 10 రీచ్‌లకు మైనింగ్ శాఖ అనుమతులు ఇచ్చింది. సర్వే నెంబర్ల ప్రకారం ఎంత ఇసుక తియ్యాలనే పరిమాణాన్ని కూడా నిర్ణయించింది. ప్రస్తుతం కేటాయించిన రీచ్‌ల సర్వే నెంబర్లలో ఇసుక తవ్వకాలు జరపాలంటే మరో వారం పది రోజులు అన్ని అనుమతులు సమయం పడుతుంది. అయితే ఇప్పుడు కొత్తగా ఇచ్చిన రీచ్‌లలో కొన్ని రీచ్‌లు ఇప్పటికే ఇసుక తవ్వేసి ఉండటం విశేషం. టన్ను నుంచి రెండు టన్నులు పైగా ఒకేసారి ఇసుకను తవ్వగలిగే బొచ్చలు ఉన్న పొక్లెయిన్లతో ఇసుక తోడేస్తుంటే నదీ అడుగు ఉన్న నీరు కూడా బయట పడి భూగర్భ జలాలకు ముప్పు ఏర్పడుతూనే ఉంది.

కొల్లిపర, మంగళగిరి మండలాల పరిధిలో రైతులు, స్థానికులు నీటి ఇబ్బందులతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎండ వేడి పెరుగుతుండటం, రానున్నది వేసవి కావడంతో భూగర్భ జలాలు మరింత అడుగంటి పోతే గుక్కెడు నీరు తాగడానికి అవస్థలు పడాల్సిందేనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మరోపక్క జగనన్న కాలనీలకు మెరకలు తోలేందుకు గడిచిన రెండేళ్ల నుంచి బుసక కోసం అనుమతులు పెట్టుకుని విచ్చలవిడిగా ఇసుకను తరలించేస్తున్న పరిస్థితులు కూడా ఉన్నాయి. బొమ్మువానిపాలెం, చిలుమూరు, జువ్వలపాలెం ప్రాంతాల్లో ఏ అనుమతులు లేకపోయినా బుసక తవ్వకాలు జరుగుతున్నాయంటూ అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు, ఇసుక, బుసక తరలింపు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎన్‌జిటి ఉత్తర్వులు, కలెక్టర్ల ఆకస్మిక తనిఖీలతో ఇప్పటికైనా ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడుతుందని కృష్ణా పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు ఆశ పడితే ఎక్కడా వీటికి అడ్డుకట్ట పడలేదు. కలెక్టర్ల తనిఖీలకు ముందు జరిగిన తవ్వకాలకు రెట్టింపు చేసి మరీ అక్రమ తరలింపులకు తెగబడుతుండటం విశేషం.



జీసీకేసీ పేరుతో ఇస్తున్న బిల్లు

సుప్రీంకోర్టు తీర్పుపై ఉత్కంఠ

ఎన్‌జీటీ ఆదేశాల మేరకు ఇటీవలే రెండు జిల్లాల కలెక్టర్లు వారి పరిధిలో ఇసుక రీచ్‌లకు వెళ్లారు. ఆ సమయంలో కొంతమంది సిబ్బంది ముందుగానే వారికి సమాచారం ఇచ్చి యంత్రాలను కనిపించకుండా చేశారు. దాంతో ఇసుక తవ్వకాలు అంతా సవ్యంగా సాగుతున్నట్లు కలెక్టర్లు నివేదికలను ఎన్‌జీటీకి సమర్పించారు. రెండు జిల్లాల్లో ఎక్కడా ఇసుక తవ్వకాలు అనుమతులకు విరుద్ధంగా జరగడం లేదని, యంత్రాలు అసలే వాడటం లేదని వారిచ్చిన నివేదికల్లో పేర్కొన్నారు. అయితే కేంద్ర పర్యావరణ అటవీశాఖ కమిటీ మాత్రం యంత్రాలను వినియోగిస్తున్నారని, అనుమతుల్లేని చోట్ల తవ్వుతున్నారని పేర్కొన్నది. కలెక్టర్ల నివేదికలు అవాస్తవమని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ కమిటీ పేర్కొన్నది. రీచ్‌ల వద్దనే టన్నుకు రూ.475 వసూలు చేస్తున్నారు. ఒక్కో రీచ్ నుంచి నిత్యం వెయ్యి నుంచి 2 వేల టన్నుల వరకు ఇసుకని యంత్రాల ద్వారా తీస్తున్నట్లు నివేదించింది. ఉపగ్రహం ద్వారా ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి సేకరించిన చిత్రాలను ఎన్‌జీటీకి సమర్పించింది. ఈ నేపథ్యంలో ఈ కేసుపై తుది తీర్పుని సుప్రీంకోర్టు విచారణ జరిపి ఇవ్వనున్నది. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. సుప్రీంకోర్టు కనుక శాస్త్రీయ ఆధారాలు, కేంద్ర కమిటీ నివేదికలను పరిగణనలోకి తీసుకుంటే అధికారులకు చిక్కులు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

అక్రమాలు కోకొల్లలు..

ప్రకాశం బ్యారేజ్ ఎగువన గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో పలుచోట్ల ఇసుక అక్రమ తవ్వకాలు నేటికీ కొనసాగుతోన్నాయి. అమరావతి మండలం వైకుంఠపురం రీచ్ వద్ద ఎలాంటి పర్యావరణ అనుమతులు లేవు. దిడుగు, పొందుగల రీచ్‌లకు ఈసీ అనుమతులు ఉన్నప్పటికీ అక్కడ ఎలాంటి యంత్రాలు వినియోగించరాదు. అయితే అక్కడ ఎప్పుడు వెళ్లి చూసినా భారీ ఎక్స్‌కవేటర్లతో లారీలు, ట్రక్కుల్లోకి ఇసుక లోడింగ్ జరుగుతుంటుంది. వైకుంఠపురం రీచ్‌లో ఇసుక నీటిలో ఉంటుంది. ఈ కారణంగా నాణ్యత ఎక్కువగా ఉంటుండటంతో డిమాండ్ అధికంగా ఉన్నది. దీంతో ఇక్కడ డ్రెడ్జర్లు, ఎక్స్‌కవేటర్లతో ఇసుకని తోడేస్తున్నారు. తుళ్లూరు మండలం రాయపూడిలో మూడు రోజుల క్రితం ఇసుక తవ్వకాలు చేపట్టగా టీడీపీ నాయకులు వెళ్లి అడ్డుకోవడంతో అక్కడ తాత్కాలికంగా ఇసుక తవ్వకాలు నిలిచాయి. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలో కోనూరు, అంబడిపూడిలో కలిపి మొత్తం ఆరు చోట్ల మాత్రమే ఈసీలున్నాయి. కోగంటివారిపాలెం, కస్తల, చామర్తి, కొత్తపల్లిలోనూ ఇసుక తవ్వకాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 200 ఎక్స్‌కేవేటర్లు పెట్టి కోగంటివారిపాలెంలో నిత్యం 100 లారీలకు పైగా ఇసుకని తోడేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

నిధుల్లేవ్

- సంక్రాంతి.. కొండవీడు ఉత్సవాలకు నిధులు
- వీటికి రూ.40 లక్షలకు పైగా ఖర్చు
- కోటప్పకొండ తిరునాళ్లకు నిధులు లేవట..!
- తిరునాళ్ల ఏర్పాట్లకు పంచాయతీల నుంచి వసూళ్లు
- రాష్ట్ర పండుగ హోదాతో సరిపుచ్చుతున్న ప్రభుత్వం
- ఏటా తిరునాళ్ల ఏర్పాట్లకు నిధుల తంటా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సంబరాలు.. కొండవీడు ఉత్సవాలకు లక్షలు ఖర్చు చేశారు. నెల రోజుల వ్యవధిలో ఈ రెండింటికి దాదాపు రూ.40లక్షల ప్రభుత్వ నిధులను వెచ్చించారు. వీటికి నిధులు విడుదల చేసిన అధికారులు కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లకు నిధులు లేవని చెబుతుండటం వారి చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి సన్నిధిలో మహాశివరాత్రి సందర్భంగా 8న జరగనున్న తిరునాళ్లకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పిస్తున్న ప్రభుత్వం నిధుల విడుదలను విస్మరిస్తోంది. గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఏర్పాట్లకు చందాలపైనే ఆధారపడాల్సివస్తోంది. తిరునాళ్ల ఏర్పాట్ల కోసం జిల్లాలోని పంచాయతీ నుంచి వసూలుకు కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాలు జారీ చేశారు. అసలే నిధుల లేమితో గ్రామాల్లో పనులు చేయలేని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తిరునాళ్ల భారాన్ని పంచాయతీలపై మోపడాన్ని కొందరు సర్పంచ్‌లు వ్యతిరేకిస్తున్నారు.

నిధుల దుబారా..

సంక్రాంతి సంబరాలు, కొండవీడు ఉత్సవాల పేరుతో లక్షల్లో ప్రభుత్వ నిధులను ఖర్చు చేశారు. కొందరు అధికారులు వారి కోర్కెలు తీర్చుకొనేందుకే వీటిని నిర్వహించారన్న విమర్శలున్నాయి. కేవలం నృత్యాల కోసం నిధులు దుబారా చేశారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. గత రెండేళ్లుగా సంక్రాంతి సంబరాలకు రూ.20లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఏటా ఖర్చు చేశారు. అలాగే కొండ వీడు ఉత్సవాలకు లక్షల్లో నిధులు వెచ్చించారు. ఏ నిధులు విడుదల చేశారన్న అంశంపై నేటివరకు వెల్లడించ లేదు. దీంతో ఆయా కార్యక్రమాల నిర్వహణలో పారదర్శకత లేదన్న ఆరోపణ ఉన్నాయి. ఇప్పటికైనా ఆ ఈవెంట్‌లకు ఎంత ఖర్చు చేశారన్న అంశాన్ని వెల్లడించాలన్న వాదన కూడా వినిపిస్తోంది. ఈ నిధులను విడుదల చేయడంలో కృషి చేసిన అధికారులు తిరునాళ్లకు మాత్రం నిధులు సమకూర్చే విషయంలో వారికి చిత్తశుద్ధి కొరవడిందన్న విమర్శలున్నాయి.

ఏసీని సెలవులో పంపించారు..

కోటప్పకొండ దేవస్థానంలో అధికార పార్టీ జోక్యం అధికమైంది. సదరు నేతలు అనుమతిస్తేనే ఇక్కడ విధులు నిర్వహించాల్సిన దుస్థితి. దేవస్థానాన్ని ఏసీ క్యాడర్‌కు అప్‌గ్రేడ్ చేశారు. ఏసీని విధుల్లో చేరకుండా అధికార పార్టీ నేతలు అడ్డుకున్నారు. సెలవులో వెళ్లాలని, తిరునాళ్ల తర్వాత వచ్చి విధుల్లో చేరాలని ఏసీని హెచ్చరించారు. దీంతో సెలవులో ఏసీ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి వెళ్లారు. ఈవో ఇన్‌చార్జ్ ఈవో జి.శ్రీనివాసరెడ్డి కొనసాగుతున్నారు. ఈవో కూడా నిబంధనలు పాటించకుండా విధుల్లో కొనసాగుతుండటం గమనార్హం. ఏసీ విధుల్లో చేరితే తిరునాళ్ల కొనుగోళ్లలో అవకతవకలకు అవకాశం ఉండదనే ఉద్దేశ్యంతోనే ఆయనను సెలవులో పంపించి వేశారన్న ఆరోపణలున్నాయి. ఏ సరుకులు ఎంతకు కొనుగోలు చేస్తున్నారన్న అంశాన్ని బహిర్గతం చేయడంలేదు. ఇప్పటికైనా సరుకులు, ఇతర సామాగ్రి కొనుగోళ్లకు సంబంధించిన రేట్లను అధికారికంగా వెల్లడిస్తే అపోహలు, ఆరోపణలకు తావుండదు. దేవస్థానం కోసం చేస్తున్న సామాగ్రి రేట్ల వెల్లడించేందుకు ఈవో స్పందిస్తారా?, ఆరోపణలకు బలం చేకురుస్తారో వేచి చూడాలి.

ఐదేళ్లుగా తిరునాళ్లకు నిధులు ఇవ్వని ప్రభుత్వం

తిరునాళ్లకు గత ఐదేళ్ల నుంచి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయడంలేదు. కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు ఏటా తిరునాళ్లకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు వసూలు విడుదల చేశాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క తిరునాళ్లకు కూడా ప్రత్యేకంగా నిధులు విడుదల చేయకపోవడం గమనార్హం. ఈ ఏడాది కూడా ఇప్పటివరకు నిధుల ఊసే ప్రభుత్వం ఎత్తలేదు. తిరునాళ్ల ఏర్పాట్లకు ఈసారి కూడా పూర్తిగా చందాలపైనే ఆధార పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒకటి కల్లా పంచాయతీలు ఉత్తర్వుల్లో పేర్కొన్నా విధంగా కొండకావూరు పంచాయతీ ఖాతాకు జమ చేయాలని ఉత్తర్వుల్లో తెలిపారు. తిరునాళ్లలో పారిశుధ్య పనుల కోసం పంచాయతీల నుంచి నిధులు సేకరిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కరరెడ్డి తెలిపారు. పంచాయతీల నుంచి 20 ఏళ్లుగా నిధులు సమకూర్చునట్టు చెప్పారు.

వీఐపీల బస్సులకు నిధులు చెల్లిస్తామని హామీ

తిరునాళ్లకు వచ్చే వీఐపీల సేవలో అధికారులు తరిస్తున్నారు. వీరికి ఏర్పాట్లు చేయడానికి ఇస్తున్న ప్రాధాన్యం సామాన్య భక్తులకు ఇవ్వడం లేదన్న విమర్శలున్నాయి. వీఐపీలను ఉచితంగా కొండ దిగువ నుంచి దేవస్థానానికి తరలించేందుకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు అయ్యే డబ్బు చెల్లించిన అధికారులు భక్తులకు ఏర్పాట్ల విషయంలో నిధులు కేటాయించకుండా మిన్నకుండటం గమనార్హం. డబ్బు చెల్లించందే బస్సులు ఏర్పాటు చేయలేమని ఆర్టీసీ తేల్చి చెప్పింది. దీంతో బస్సులు ఏర్పాటు చేయండి డబ్బు చెల్లిస్తామని సదరు అధికారి తిరునాళ్ల సమీక్షా సమావేశంలో వెల్లడించారు. తిరునాళ్ల ఏర్పాట్ల నిధులపై సమావేశంలో చర్చ జరగకపోవడం గమనార్హం. అయితే కొండ దిగువన పారిశుధ్య పనులకు పంచాయతీలు, మండలపరిషత్‌ల నుంచి రూ.14.45 లక్షలు వసూలు చేసేందుకు కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే గత ఏడాది పంచాయతీల నుంచి రూ.5 లక్షలు వసూలు చేసినట్టు సమావేశంలో పంచాయతీ అధికారి వెల్లడించారు. అయితే ఈ ఏడాది రూ.14.45 లక్షలు వసూలుకు ఉత్తర్వుల విడుదలపై చర్చ జరుగుతోంది. మైనర్ పంచాయతీలు రూ.10వేలు, మేజర్ పంచాయతీలు రూ.20 వేలు, మండల పరిషత్‌ల నుంచి రూ.50 వేలు తిరునాళ్ల కోసం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పరీక్షలను సజావుగా నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో మంత్రి బొత్స
- పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశాలు



పది, ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో పాల్గొన్న కలెక్టర్

గుంటూరు ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పది, ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అవసరమైన చర్యలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి సూచించారు. గురువారం తాడేపల్లిలోని విద్యా శాఖ కార్యాలయం నుంచి మంత్రి బొత్స, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్‌ప్రకాష్, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్‌కుమార్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరబ్ గౌర్ ఇంటర్మీడియట్, 10వ తరగతి, టెట్, డీఎస్సీ పరీక్షలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మంత్రి బొత్స మాట్లాడుతూ వచ్చే నెల అంతా పరీక్షల కాలమని, దాదాపు 20 లక్షల మంది వివిధ పరీక్షలకు హాజరవుతున్నారు.రెండేళ్లుగా పూర్తి కట్టుదిట్టమైన చర్యలతో పకడ్బందీగా పరీక్షలను నిర్వహించినట్లే, ఈసారి కూడా పరీక్షలను నిర్వహించాలన్నారు. అధికారులందరూ పరీక్షా కేంద్రాల్లోని ఏర్పాట్లను ముందుగానే పరిశీలించి మరోసారి అన్ని సక్రమంగా ఉన్నట్లుగా నిర్ధారించుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మార్చి 1 నుంచి 20 వరకు నిర్వహించే ఇంటర్ పరీక్షలు, మార్చి 18 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసి పరీక్షలను తనిఖీ చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ బస్సులతో రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లాలో 92 కేంద్రాల్లో 57,538 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు చీఫ్ సూపరింటెంట్లు ముందస్తుగా ఫిబ్రవరి 28 నాటికి పూర్తి స్థాయిలో పరిశీలించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుకు సంబంధిత తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల వద్ద బందోబస్తుతో పాటు, విద్యార్థులను తనిఖీ చేసి అనుమతించేందుకు మహిళా పోలీసులను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు జరుగుతుందన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు ఆర్.ఏ.ఓ జుబేర్, డీఈవో శైలజ, పరీక్షల స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, డీఈసీ మెంబరు బాలామోహన్, అధికారులు పాల్గొన్నారు.

రేంజ్‌లో మరికొందరు డీఎస్పీల బదిలీ



గుంటూరు, ఫిబ్రవరి 22: రేంజ్‌లో మరికొందరు డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పలువురు డీఎస్పీలను బదిలీ చేసిన వారికి తిరిగి స్థాన చలనం కల్పించారు. బదిలీ అయిన డీఎస్పీల వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ 2 డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఈ అశోక్‌కుమార్ గౌడ్‌ను తుళ్లూరు డీఎస్పీగా నియమించారు. తుళ్లూరు డీఎస్పీగా ఉన్న ఎం వెంకటేశ్వరరావును ఇంటిలిజెన్స్‌కు బదిలీ చేశారు. నూజివీడు డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణను బాపట్ల డీఎస్పీగా బదిలీ చేశారు. బాపట్ల డీఎస్పీ టీ వెంకటేశ్వర్లును ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ 2 డీఎస్పీగా నియమించారు. ఏసీబీలో పనిచేస్తూ తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా అటాచ్మెంట్‌పై ఉన్న జీ శ్రీనివాసరావును పల్నాడు జిల్లా సీసీఎస్ డీఎస్పీగా నియమించారు. ఇంటిలిజెన్స్ డీఎస్పీగా ఉన్న జీ లక్ష్మయ్యను నూజివీడు డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మిర్చి.. పోటెత్తింది..

- యార్డుకు 2.50 లక్షల టిక్కీల రాక.. కిక్కిరిసిపోయిన ప్రాంగణం
- నేడు సరుకు తీసుకురావొద్దని రైతులకు మార్కెట్ కమిటీ విజ్ఞప్తి
- అలానే ప్రతి బుధవారం కొత్తవి అనుమతించరాదని నిర్ణయం



మూడు ముక్కలాటలు ఎంతోకాలం సాగవు

- దమ్ముంటే మాస్టర్‌ప్లాన్ ప్రకారం రాజధానిని అభివృద్ధి చేయాలి
- 1528వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

6లో..



తోటల్లో కోసి ఉంచిన నిమ్మకాయలు

- ఎలక్ట్రానిక్ మిషన్ మూలన..
- నిమ్మ రైతుకి పట్టపగలే కుచ్చుటోపి

తూకంలో.. తకరారు

తెనాలి క్రైం, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో ఏలూరు, గూడూరు తరువాత తెనాలిదే అతి పెద్ద నిమ్మకాయ మార్కెట్. ఈ మార్కెట్ యంత్రాంగం ప్రస్తుతం డమ్మీగా మారిపోయింది. ఇక్కడి వ్యాపార లావాదేవీలన్నీ ఒకరిద్దరి కనుసన్నల్లోనే సాగుతాయి. వారు చెప్పిందే వేదం, వారు నిర్ణయించిందే ధర. లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టపడిన రైతులు కాయలు అమ్ముకునే దశలో మధ్య దళారులు, వ్యాపారులు ముందు తలవంచాల్సిందే.


తెనాలి ప్రాంతంలో ఆరు వేల ఎకరాల్లో నిమ్మతోటలు సాగు అవుతున్నాయి. ఎలక్ట్రానిక్ మిషన్ ద్వారా కచ్చితమైన తూకం వేసి ప్రింట్ రశీదు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. కానీ కమీషన్స్ మరిగిన మార్కెటింగ్ సిబ్బంది, అధికారులు వ్యాపారుల చేతుల్లో డమ్మీగా మారిపోయారు. సంవత్సరాల కాలంగా రైతులు డిమాండ్ చేస్తున్నా అది వారికి పగటి కలగానే మిగిలిపోయింది. నిబంధనల ప్రకారం రైతు ప్రతి వంద రూపాయల అమ్మకాలకు రూ.4 మాత్రమే కమీషన్ చెల్లించాలి కానీ ఇక్కడ వ్యాపారులు రూ.10 కమీషన్ తీసుకుంటున్నారు. 50 కిలోల బస్తా కాటా కూలీ కింద అన్ని మార్కెట్‌లలో రూ.6 నుంచి 10 తీసుకుంటుంటే తెనాలి మార్కెట్‌లో రూ.16 రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. మార్కెట్ కార్యదర్శి తప్పనిసరిగా రైతు కాయల అమ్మకాలపై తక్‌పట్టి ఇవ్వాలి. ఇందులో పంట వివరాలు ఉంటాయి. ఒక రకంగా ఇది రైతు బీమా పథకం వంటిది. ప్రమాదవశాత్తు రైతుకు మరణం సంభవిస్తే ఈ తక్‌పట్టి వలన రైతు కుటుంబానికి ప్రమాద బీమా సొమ్ము ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఇంతవరకు తెనాలి మార్కెట్ యార్డులో తక్‌పట్టిలు అమలు జరిపిన దాఖలాలు లేవు. ఉన్నతాధికారుల ఆదేశంతో ఈనామ్ పద్ధతిలో పాటలం నిర్వహించడానికి గతంలో మార్కెటింగ్ అధికారులు రూ.60 లక్షలతో ఎలక్ట్రానిక్ మిషన్లు కొనుగోలు చేశారు. అవి రెండు రోజుల కంటే పని చేసిన దాఖలాలు కనిపించలేదు. ఇంతలో కొందరు వ్యాపారులు ఈ పద్ధతిపై కన్నెర్ర చేయడంతో కమీషన్స్‌కు అలవాటు పడ్డ మార్కెటింగ్ సిబ్బంది ఆ విలువైన యంత్రాలను తుక్కుగా మార్చారు. వ్యాపారులు కాయల కాటా సమయంలో బస్తాకి ఎన్ని కిలోలు ఉన్నదీ లెక్కల్లోకి తీసుకుని ఆపై అదనంగా ఉన్న గ్రాములను మాత్రం వదిలి వేస్తున్నారు. దీని వలన ఏడెనిమిది బస్తాలు తెచ్చిన రైతుకు ఐదారు కిలోలు లెక్కలోకి రాకుండా పోతుంది. ఇప్పటికీ రైతుకు వ్యాపారులు కాగితాలపై అర్థం కాని చేతిరాతతో రాసిన రశీదులు మాత్రమే ఇస్తున్నారు. దీని వలన కొంతమంది రైతులు మోసాలకు గురవుతున్నారు. కొందరు చిన్న, సన్నకారు రైతుల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు వారికి అధిక వడ్డీలకు సొమ్ము ఇచ్చి ఆ వ్యాపారి చెప్పిన ధరకే సరుకు అమ్ముకునే విధంగా ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఆ చిన్న, సన్నకారు రైతులు మరింత ఆర్థిక దోపిడికి గురవుతున్నారు. మార్కెటింగ్ సిబ్బంది యార్డులో జరుగుతున్న దోపిడిలపై రైతు కష్టాలపై కన్నెత్తి చూడటం లేదు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పూత, పిందె రాలిపోయి తెగుళ్ల సమస్యతో దిగుబడులు అంతంత మాత్రంగా ఉన్నాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మార్కెట్ యార్డులో కళ్ల ముందు జరుగుతున్న దోపిడిని అరికట్టాలని, కనీసం తూకం వేసిన బస్తాలకైనా ప్రింటింగ్ రశీదు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



సరుకు నాణ్యత పరిశీలన కోసం ఉంచిన నిమ్మకాయలు



పాతబడిన ఎలక్ట్రానిక్ కాటా



మార్కెట్‌కు చేరిన నిమ్మకాయ బస్తాలు



ఎమ్మెల్యే అనగాని సమక్షంలో టీడీపీ పార్టీలో చేరుతున్న వైసీపీ శ్రేణులు

టీడీపీలోకి చేరిన వైసీపీ వర్గీయులు

చెరుకుపల్లి, ఫిబ్రవరి 2: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ కృషి చేస్తున్నారని అందుకే ఆకర్షితులమై వైసీపీ నుంచి టీడీపీ పార్టీలోకి చేరామని గ్రామస్తులు తెలిపారు. ఆరుంబాక, తుమ్మలపాలెం, పంచాయతీలలోని పులిగడ్డవారిపాలెం గ్రామాలకు చెందిన 20 కుటుంబాల వారు గురువారం టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి, దాసరి సురేష్, కోటయ్య, సత్యనారాయణ, పులిగడ్డ నారాయణ, పలు కుటుంబాల సభ్యులు ఉన్నారు. రేపల్లె నియోజకవర్గ జనసేన సమన్వయకర్త మత్తి భాస్కరరావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలతో కోట్లు దోచేశారు

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్

అచ్చంపేట, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలతో వైసీపీ ప్రభుత్వం కోట్ల రూపాయలు దోచుకుంటుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గురువారం అచ్చంపేటలో షెడ్డు వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా 24 గంటలు తవ్వకాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో రీచ్‌లో రోజుకు రెండు వేల టన్నులు అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రభుత్వానికి నివేదికలు అందించిందని, శాటిలైట్ చిత్రాల ద్వారా తవ్వకాలు, ఆధారాలు సేకరించారని నివేదికలో తెలిపారు. ఇసుకాసురుడు అరాచకాలు చేస్తున్నా ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం దారుణమని, ప్రభుత్వ అధికారులు అక్రమ దారులకు అడ్డగోలుగా అండదండలు అందిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, క్లస్టర్ ఇన్‌చార్జ్ బత్తుల శ్రీనివాసరావు, ఎస్‌కే కాసుల, పొన్నెకంటి రవి, నల్లమోతు హరిబాబు, సందెపోగు సామ్యేలు, రేపూడి తోమాస్, ఏసుపోగు నాగయ్య, నల్లపాటి చందు, మేకల వెంకటరావు, ఎనుముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల త్యాగానికి దృశ్య రూపం 'రాజధాని ఫైల్స్'

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 22: రాష్ట్ర భవిష్యత్తు కోసం అమరావతి రైతులు చేసిన త్యాగానికి, స్వార్ధ రాజకీయం, దోపిడీ కోసం సీఎం జగన్‌రెడ్డి చేసిన మోసానికి దృశ్య రూపమే 'రాజధాని ఫైల్స్' చిత్రమని అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం రైతులు, పార్టీ నాయకులతో కలసి ప్రత్తిపాటి చిలకలూరిపేటలో రాజధానిఫైల్స్ చిత్రాన్ని వీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేవలం అహంతో, రాజకీయ కక్షతో ప్రపంచ స్థాయి నగర నిర్మాణ స్వప్నాలను ఛిదిమేసిన సీఎం జగన్ తప్పకుండా చూడాల్సిన చిత్రమిదని అన్నారు. చట్టసభలో అమరావతిని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని చెప్పి అంతలోనే నాలుక మడతవేసి అమరావతి రైతులను రోడ్డున పడవేసిన పాపాన్ని జగన్ జన్మజన్మలకు కడుక్కోలేరన్నారు. మరో రెండునెలల్లో రాష్ట్రానికి జగన్ గ్రహణం తొలగిపోయి మంచిరోజులొస్తాయని, తరతరాలకు చరిత్రలో నిలిచిపోయే రాజధాని నిర్మాణం పూర్తిచేసే బాధ్యత టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వం తీసుకుంటాయన్నారు. ఇందుకుగాను ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం వైసీపీకి అడ్రస్ లేకుండా చేసి టీడీపీ, జనసేన కూటమికి క్లీన్ స్వీప్ విజయాన్ని అందించాల్సిన బాధ్యత జిల్లా వాసులపై ఉందన్నారు.

మిర్చి.. పోటెత్తింది..

● యార్డుకు 2.50 లక్షల టిక్కీల రాక.. కిక్కిరిసిపోయిన ప్రాంగణం
● నేడు సరుకు తీసుకురావొద్దని రైతులకు మార్కెట్ కమిటీ విజ్ఞప్తి
● అలానే ప్రతీ బుధవారం కొత్తవి అనుమతించరాదని నిర్ణయం

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మిర్చి ధరలు పతనం కావడంతో అక్కడి రైతులంతా గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు) వైపు దృష్టి సారించారు. నిత్యం వందల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లు, ట్రక్కు ఆటోల్లో లక్షల టిక్కీలను విక్రయానికి తీసుకొస్తున్నారు. గుంటూరు, పల్నాడు, కర్నూలు, ప్రకాశం జిల్లాల నుంచి కూడా రైతులు మిర్చి విక్రయానికి తీసుకొస్తుండటంతో యార్డుప్రాంగణమంతా కిక్కిరిసిపోతుంది. బుధవారం సాయంత్రం మొదలుకొని గురువారం ఉదయం వరకు దాదాపుగా 2.50 లక్షల కొత్త మిర్చి టిక్కీలు యార్డుకు రైతులు తీసుకొచ్చారు. అంతకు ముందు రోజు విక్రయం జరగగా లక్ష టిక్కీల వరకు యార్డులో నిల్వ ఉండటం, కొత్తగా వచ్చిన వాటితో యార్డులో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది.

తేజ, బ్యాడిగి వంటి రకాలు నాణ్యత బావుంటేనే యార్డులో క్వింటాల్‌కు రూ.20 వేల ధర లభిస్తున్నది. క్వాలిటీ తగ్గితే మాత్రం క్వింటాల్‌కు రూ.13వేల ధర మాత్రమే ఎగుమతిదారులు చెల్లిస్తున్నారు. చాలాప్రాంతాల్లోని మొదటి కాపుని ఇప్పటికే రైతులు అమ్మేశారు. దీంతో ఆయా రైతులు రెండో కాపు కాయలను తీసుకొస్తున్నారు. సహజంగానే రెండో కాపు కాయలు కొంచెం పొట్టిగా ఉంటాయి. దీంతో వ్యాపారులు ధర తగ్గించేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం మార్కెట్లలో ధర మరింత తక్కువగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. కర్ణాటకలోనూ ఇదే పరిస్థితి. ఇది కూడా ఇక్కడికి ఎరైవల్స్ పెరగడానికి ఒక కారణంగా మారింది.



మిర్చియార్డులో ఎరైవల్స్‌ని పరిశీలిస్తున్న మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

రోజురోజుకు టిక్కీల రాక పెరుగుతూ యార్డులో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతుండటంతో గురువారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, మార్కెటింగ్‌జేడీ కాకుమాను శ్రీనివాసరావు యార్డులో పర్యటించారు. దిగుమతి, ఎగుమతి వ్యాపార సంఘాల నాయకులు లేళ్ల అప్పిరెడ్డి, కుర్రి సాంబిరెడ్డి, జుగిరాజ్ భండారి, పొత్తూరి నరేంద్ర, తోట రామకృష్ణ, రమేష్, గ్రేడ్-2 సెక్రెటరీ ఆంజనేయసింగ్, ఇన్‌ఛార్జ్ పి.శ్రీకాంత్‌తో సమావేశమై చర్చించారు. గురువారం సరుకు ఎక్కువగా రావడంతో శుక్రవారం విక్రయానికి తీసుకొద్దామని ప్లాన్ చేసుకొన్న రైతులు రావొద్దని విజ్ఞప్తి చేశారు. తద్వారా శుక్రవారం యార్డులో నిల్వవున్న టిక్కీల ట్రేడింగ్ జరుగుతుందని, ఆ టిక్కీలన్ని శని, ఆదివారాల్లో బయటకు వెళ్లిపోతాయని చెప్పారు. కాగా పీక్‌సీజన్ కావడంతో ఇక నుంచి ప్రతీ మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకు కొత్త ఎరైవల్స్‌ని అనుమతించరాదని నిర్ణయించారు. ఈవిషయాన్ని రైతులు గమనించి కమిటీకి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.



మందడం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

మూడు ముక్కలాటలు ఎంతోకాలం సాగవు

● దమ్ముంటే మాస్టర్‌ప్లాన్ ప్రకారం రాజధానిని అభివృద్ధి చేయాలి
● 1528వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 23: పచ్చి అబద్ధాలతో సీఎం జగన్‌రెడ్డి కాలం వెళ్లబుచ్చుతున్నారని రాజధానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1528వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, రాష్ట్రాన్ని నాశనం చేయటానికి పెట్టిన మూడు ముక్కల ఆటలు ఎంతకాలం సాగవన్నారు. ప్రత్యేక హోదా తెస్తానని చెప్పి ఆ ఊసే లేకుండా వైసీపీ ప్రభుత్వం మిన్నకుండి పోయిందన్నారు. హోదా గురించి అడుగుతారని మూడు రాజధానులను అంశం తీసుకొచ్చి ప్రజలను పక్కదారి పట్టించారన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కలాటకు స్వస్తి పలకాలన్నారు. దమ్ము ధైర్యం ఉంటే రాజధాని అమరావతిని మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయాలన్నారు. అప్పుడే రాష్ట్రం ప్రగతి బాటలో పయనిస్తుందన్నారు. అమరావతిని నాశనం చేయాలనుకుంటే మట్టి కొట్టుకు పోవటం ఖాయమన్నారు. జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి అమరావతి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి. తుళ్లూరు, మందడం, వెలగపూడి, అనంతవరం, నెక్కల్లు, వెంకటపాలెం తదితర రాజధాని గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

వైసీపీ నేతల కనుసన్నల్లో అక్రమ ఇసుక రీచ్‌లు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 22: వైసీపీ కనుసన్నల్లో 500 అక్రమ ఇసుక రీచ్‌లు ఉన్నాయని, ఇసుక అక్రమ తవ్వకాలు నిజమేనని హైకోర్టుకు ఎంఓఈఎఫ్ సమర్పించిన నివేదికకు సీఎం సమాధానం చెప్పాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా పెట్రేగిపోతున్న జిల్లా కలెక్టర్లకు కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు. అధికార వైసీపీ ఇసుక మాఫియా అక్రమంగా సీసీ కెమెరాలు, కంప్యూటర్ బిల్లులు లేకుండా రీచ్‌లో తవ్వకాలు జరుపుతూ రోజుకు రెండు వేల టన్నుల ఇసుకను తవ్వి విక్రయిస్తూ దోచుకుంటున్నారని అన్నారు. డిసెంబర్ నుంచి కృష్ణా, గుంటూరు జిల్లాలో జీసీకేసీ ప్రాజెక్టు సంస్థ భారీ యంత్రాలతో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేస్తుందని, దీని వెనుక వైసీపీ నేతల హస్తం ఉందన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంతజిల్లా చిత్తూరులో అక్రమ ఇసుక రవాణాపై రూ.18 కోట్లు జరిమానా విధించడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఇసుకలో దోచుకున్న డబ్బుతో ఎన్నికలలో గెలవాలని జగన్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని, టీడీపీ అధికారంలోకి రాగానే వైసీపీ నేతలు బొక్కిన ఇసుక కుంభకోణాన్ని కక్కిస్తామన్నారు.



సీజీజీబీ ఆర్‌ఎంకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘాలు, ప్రజా సంఘాల నేతలు

బాధిత రైతులకు నష్ట పరిహారం

● బ్యాంక్ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు వెల్లడి

క్రోసూరు, ఫిబ్రవరి 22: దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో గోల్డ్ అప్రైజర్ నాగార్జున నిర్వాకం వల్ల బంగారం మాయం కాగా.. బాధిత రైతులకు త్వరలో నష్ట పరిహారం చెల్లిస్తామని బ్యాంక్ రీజనల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం దొడ్లేరు సీజీజీబీలో ఆయన బాధితులతో మాట్లాడారు. గ్రాము బంగారానికి రూ.6,655 చొప్పున పరిహారం చెల్లించనున్నట్టు ఆయన తెలిపారు. తమ బంగారం కనపడ కుండా పోయిందని, 498 మంది అర్జీలు ఇచ్చారని, వారిలో 321 మందికి పరిహారం చెల్లించనున్నట్టు చెప్పారు. ఇంకా 98 మంది రైతులకు సంబంధిఇంచిన బంగారం మాయమైనట్టు ఎటువంటి ఆధారాలు లభించలేదని, నిశితంగా పరిశీలించి ఆధారాలు లభిస్తే వారికి కూడా పరిహారం చెల్లిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న ధరలో తరుగు తీసివేసి చెల్లిస్తామనటం భావ్యం కాదని, లబ్ధిదారుల తరఫున ప్రజా సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు, రీజనల్ మేనేజర్‌కు చెప్పారు. రీజనల్ మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంజిమాల రవిబాబు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆవుల ఆంజనేయులు, కేవీపీఎస్ కార్యదర్శి ముత్యాల పౌలు, భవన నిర్మాణ సంఘం నాయకులు గారపాటి సుభానీ, నటరాజు, కోటి, నాగుల్ షరీఫ్, ఘన్ సైదా, ఆంజనేయులు నాయక్ తదితరులు ఉన్నారు.

కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పదవికి

లేళ్ల వెంకటరావు రాజీనామా

క్రోసూరు, ఫిబ్రవరి 22: రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి క్రోసూరు మండలానికి చెందిన లేళ్ల వెంకటరావు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ అధ్యక్షునికి రాజీనామా లేఖను పంపుతున్నట్టు తెలిపారు. అచ్చంపేట, క్రోసూరు మండలాలకు చెందిన కాపు నేతల ఆత్మీయ సమావేశాన్ని గురువారం మండలంలోని ఉయ్యందనలో ఏర్పాటు చేశారు. 700 మంది అనుచరవర్గమూ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించారు. సంవత్సరకాలంగా స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తమ కులంపై కక్ష పెంచుకొని వేధింపులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇటీవల తమకులానికి చెందిన ఓట్లను తొలగించారని, కాపు కులాన్ని నియోజక వర్గంలో అణగ దొక్కాలని చూస్తున్నారని, దీనికి సంబంధించిన వీడియోలు, సాక్షాధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. కొత్తపల్లికి చెందిన రంగిశెట్టి నరసింహారావు అనే వ్యక్తిపై అక్రమంగా 307సెక్షన్ కింద కేసు నమోదు చేశారన్నారు. మిట్టపాలెం గ్రామానికి చెందిన చిరు వ్యాపారస్తుడు నెల్లూరి శ్రీనివాసరావుపై విజిలెన్స్‌దాడులు చేయించారన్నారు. క్రోసూరులో కంభంపాటి రాము ఇంటర్నెట్ షాపుపై ఎమ్మెల్యే కుమారుడు, ఆయన అనుచరులు దాడులు నిర్వహించి షాపు ధ్వంసం చేశార న్నారు. తనతో పాటు 15 మంది కాపుకార్పొరేషన్ డైరెక్టర్లు అసంతృప్తిగానే ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే కాపులకు న్యాయం జరిగిందని, ఉయ్యందన గ్రామంలో కాపు కార్పొరేషన్‌ద్వారా 70 మందికి రుణాలు, అనేక మందికి రూ.10లక్షల చొప్పున విదేశీవిద్య రుణాలు అందాయన్నారు. నియోజక వర్గంలోని కాపు పెద్దలతో చర్చించి తమ భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించుకుంటామని ఆయన వెల్లడించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లేళ్ల వెంకటరావు

రైల్వే అధికారుల

అలసత్వం

● భారీగా నిలిచిన ట్రాఫిక్



వేమూరులో రైల్వే ట్రాక్‌పై నిలిచిన ట్రాఫిక్

వేమూరు, ఫిబ్రవరి 22: వేమూరు రైల్వే గేటు వద్ద రోడ్డు మరమ్మత్తులు నిర్వహించే విషయంలో ఆ శాఖ అధికారులు అలసత్వం చూపారు. దీంతో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రైల్వే గేటు సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. మరమ్మత్తులు చేసేందుకు పనులు ప్రారంభించారు. ముందుగా సమాచారాన్ని ప్రజలకు తెలియజేయలేదు. రెవెన్యూశాఖకు పంపిన లేఖను సంబంధిత అధికారులు ప్రకటించలేదు. దీంతో తెనాలి, కొల్లూరు ప్రధాన రహదారిపై ఉన్న ట్రాక్ దాటేందుకు ఆటంకం ఏర్పడింది. దాదాపుగా 9గంటల పాటు అంతరాయం ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొన్నారు. ఈ సందర్భంలో రైల్వే శాఖ సిబ్బందికి ప్రయాణికుల మధ్య వాగ్వాదం కూడా చోటు చేసుకుంది. ఎటువంటి సమాచారం లేనందున సమస్య ఏర్పడింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

1,23,214 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,28,837 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,23,214 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,15,034 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20500
నెంబరు. 5	13500	20000
273	12500	16800
341	10200	20500
4884	13500	19500
సూపర్ 10	15000	16500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	21000
బ్యాడిగి	9000	20500
దేవనూరు డీలక్స్	11500	20500
తెల్లకాయలు	5000	13000

బాలికతో వివాహేతర సంబంధం

● అధికార పార్టీ నేత కుమారుడిపై ఫోక్సో కేసు

పెదకాకాని, ఫిబ్రవరి 22: గుంటూరు జిల్లా పెదకాకాని మండలం అగతవరపాడు గ్రామానికి చెందిన అధికారపార్టీ ఎంపీటీసీ కుంచాల కోటిరెడ్డి కుమారుడైన 17 ఏళ్ల బాలుడిపై ఫోక్సో కేసు నమోదైంది. ఇతడు గ్రామానికి చెందిన 14ఏళ్ల బాలికతో మూడు నెలలుగా వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. తొలుత ప్రేమిస్తున్నానంటూ నమ్మించి కొన్నినెలలుగా బాలికను వశపరచుకున్నాడు. అయితే రెండు రోజుల క్రితం పెళ్లి చేసుకోవాలని ఆ బాలిక నిలదీయడంతో అతడు అంగీకరించలేదు. పైగా సంబంధం గురించి ఎక్కడైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన బాలిక తల్లిదండ్రుల ద్వారా పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈమేరకు అతడిపై పెదకాకాని పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

చావలిలో కౌలు రైతు ఆత్మహత్య

వేమూరు, ఫిబ్రవరి 22: బాపట్ల జిల్లా వేమూరు మండలం చావలి గ్రామానికి చెందిన కౌలురైతు గోపాలం శివదుర్గాప్రసాద్(37) అప్పుల బాధతో బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య కుమార్తె ఉన్నారు. పదేళ్లుగా దుర్గాప్రసాద్ నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. కౌలుతో పాటుసాగు నిమిత్తంగా పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. సాగు కలసి రాక అప్పులు తీర్చలేకపోయాడు. దాదాపుగా నాలుగు లక్షల రూపాయలు అప్పులు కావడం, వాటిని తీర్చే దారి పరిస్థితి లేక దిక్కుతోచని పరిస్థితుల్లో బుధవారం రాత్రి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. కుటుంబసభ్యులు గమనించే సరికి అతడు మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వేమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



శివ దుర్గాప్రసాద్ (ఫైల్)

విద్యుదాఘాతంతో రైతు మృతి

మాచవరం, ఫిబ్రవరి 22: విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. దీనికి సంబందించి హెడ్‌కానిస్టేబుల్ అశోక్ తెలిపిన వివరాలిలా వున్నాయి. గ్రామా నికి చెందిన షేక్ జానీబాష(37) పొలా నికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ట్రాన్స్ ఫార్మర్ పనిచేయక పోవడంతో ఫ్యూజు వేసేందుకు ప్రయత్నించాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ఆషాబి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అశోక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జానీబాషకు ఇద్దరు పిల్లలు వున్నారు.



షేక్ జానీబాష (ఫైల్)

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

అవినీతి, ఒత్తిళ్ల మధ్య నలుగుతున్న వైద్యులు

● డాక్టర్ల ఆత్మీయ సమావేశంలో టీడీపీ నేత డాక్టర్ పెమ్మసాని
● మూడు రాజధానులు అసాధ్యమంటూ వ్యాఖ్యలు



గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి22: తాను 20 ఏళ్లలో అమెరికాలో ఉన్నా తనను ఏ ఒక్కరూ లంచం అడగ లేదని, కానీ ఎన్నో ఒత్తిళ్ళ మధ్య, అవినీతి మధ్య నలిగిపోతున్న ఇక్కడి వైద్యులు వాటిని అధిగమించి మరీ వైద్యం చేయడం నిజంగా అభినంద నీయమని టీడీపీ నేత డాక్టర్ పెమ్మసాని చంద్రశేకర్ అన్నారు. గురువారం నగరంలో లక్ష్మీపురంలో స్థానిక వైద్యులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ఓవైపు ఆరోగ్యశ్రీ బిల్లులు కోట్లాది రూపాయలు పెండింగు పడుతున్నా, వైద్యం ఆపకుండా పనిచేస్తున్న ఇక్కడి వైద్యులకు నిజంగా చేతులెత్తి దండం పెట్టాలనిపిస్తుందన్నారు. ప్రస్తుత సమస్యలతో పాటు రాబోయే సమస్యలపైనా పోరాడడానికి తాను సిద్ధంగా ఉన్నాన్నారు. ప్రభుత్వం పనితీరు బాగోకపోతే పోరాడాలే కానీ, రాష్ట్రం వదిలి వెళ్ళిపోవాల నుకోవడం సమంజసం కాదన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చే తీర్పు పైనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, తమకు సాధ్యమైనంత త్వరగా ఆస్పత్రుల పరిశ్రమలు తీసుకొస్తామని స్పష్టం చేశారు. కేవలం ఓట్ల రాజకీయానికే కానీ ఆచరణలో మూడు రాజధానులు అసాధ్యమని స్పష్టం చేశారు. జగన్‌తో పోలిస్తే పవన్‌కళ్యాణ్ వేలరెట్లు గొప్పవ్యక్తి అని కితాబిచ్చారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ.. ఇసుక, మద్యం, మైనింగ్‌తో పాటు చివరకు ఓటర్ల ఓట్లు కూడా అమ్ముకుంటామని బెదిరించే నాయకుల మధ్యన మూగ జీవాలుగా తాము చూస్తుండి పోవాల్సివస్తోందని వాపోయారు. వైద్యులపై జరుగుతున్న దాడులు, ఎదురవుతున్న సమస్యలపై కేంద్ర స్థాయిలో డాక్టర్ పెమ్మసాని ద్వారా చర్చలు జరగాలని అభిలషించారు. కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.



పూజలలో పాల్గొన్న పెమ్మసాని చంద్రశేకర్, బూర్ల రామాంజనేయులు

టీడీపీ, జనసేన కూటమి విజయం ఖాయం

● టీడీపీ నాయకులు పెమ్మసాని, బూర్ల

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి22: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమని టీడీపీ నాయకులు పెమ్మసాని చంద్రశేకర్, ప్రత్తిపాడు ఇన్‌చార్జి బూర్ల రామాంజనేయులు అన్నారు. గురువారం స్థానిక గోరంట్ల, వెంకటేశ్వర స్వామి దేవస్థాన సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ద్వావింశతి వార్షిక బ్రహోత్సవాల్లో ముగింపు ఉత్సవాల్లో టీడీపీ, జనసేన నాయకులతో కలిసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సంకీర్ణ కూటమి ఏర్పాడాలని, అలాగే రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ చంద్రబాబుతోనే పేద, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుంద న్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ, ఒక పార్లమెంటు సీటును కైవసం చేసుకునేలా ప్రతి కార్యకర్త కృషిచేయాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, జనసేన, టీడీపీ నేతలు, భక్తులు పాల్గొన్నారు.

వేసవికి ముందే గొంతెండుతున్న గుంటూరు

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్



గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం రాకమునుపే నీటి కొరతతో గుంటూరు నగర ప్రజల గొంతెండిపోతోందని టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ విమర్శించారు. టీడీపీ నగర కార్యాలయంలో గురువారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ.. గడిచిన రెండు నెలలుగా నగరంలో నీటి సరఫరా సక్ర మంగాలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఇప్పటివరకు కలుషిత నీటి సరఫరా ఆందోళనకరంగా మారగా, ఇప్పటి నుంచి తాగునీటి కొరత వేధించనుంద న్నారు. ఫిబ్రవరి పూర్తవుతున్నా, ఎండలు మండుతున్నా కార్పొరేషన్ అధికారులు సమ్మర్ యాక్షన్‌ప్లాన్ ప్రకటించకపోవటమే ఇందుకు నిదర్శనమ న్నారు. ఇకనైన నవరత్నాల భజన ఆపి, పరిశుభ్రమైన తాగునీటిని అందించి ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని నేతలను, అధికారులను డేగల ప్రభాకర్ కోరారు.


ఫ్యాను రెక్కలు విరిచేందుకు ప్రజల సిద్ధం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు కసితో సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరిది అభివృద్ధికర పాలనో.. ఎవరిది విధ్వంసక పాలనో ప్రజలకు తెలుసన్నారు. బూటకపు ప్రసంగాలు కాదు దమ్ముంటే వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు రావాలన్నారు. 2019 లో ప్రజలు ఇచ్చిన ఒక ఛాన్సే సీఎం జగన్‌కు రాజకీయంగా చివరి చాన్సని తేల్చి చెప్పారు. ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి జగన్ 77 మందిని బదిలీల పేరుతో మడత పెట్టారని మిగిలిన వారిని జనం మడత పెట్టేస్తారన్నారు. దేశంలో అత్యంత ధనిక ముఖ్య మంత్రిగా మారిన జగన్ పేదల జీవితాల గురించి మాట్లాడే అర్హత లేద న్నారు. వచ్చే ఎన్నికల్లో పెత్తందారు జగన్ కు ఐదు కోట్ల ప్రజలకు మధ్య యుద్ధం జరుగుతుందన్నారు. ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

అలరించిన భక్తరామదాసు నవరత్న కీర్తనల గోష్టి గానం



రామదాసు కీర్తనలను ఆలపిస్తున్న భక్తులు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 22: స్థానిక బృందావన గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శ్రీరామ పునర్వసు రాగ నీరాజనం, భారతీ సంగీత నిలయం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం భద్రాచల రామదాసుజయంతి ఉత్సవం వైభవంగా జరిగింది. సభా కార్యక్ర మంలో ముఖ్య అతిథేలుగా డాక్టర్ గోపాల్ దంపతులు, డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి, గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి, త్యాగరాజ సాంస్కృతిక సంఘం సలహాదారులు నేతి విశ్వేశ్వరరావు దంపతులు పాల్గొని కళాకారులను ఆశీర్వదించారు. కార్యక్ర మాన్ని అనఘా హైమా, వైణిక విద్వన్మణి, వీణా విశారద ఏ.భారతీదేవి పర్యవేక్షించారు. తొలుత కార్యక్రమాలను ఆలయ ఉపాధ్యక్షులు లంకా విజయ బాబు, అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.



కన్నెగంటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఎస్పీ చకపాణి తదితరులు

కన్నెగంటి పోరాటం చిరస్మరణీయం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి22: పశువులు, మేకలు తినే గడ్డి, ఆకులపై, కట్టె పుల్లలపై బ్రీటిష్ ప్రభుత్వం విధించిన 'పుల్లరి' పన్నుకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కన్నెగంటి హనుమంతు అని విశ్రాంత ఎస్పీ చెన్నమశెట్టి చక్రపాణి కొనియాడారు. స్థానిక గుజ్జనగుండ్ల, గ్రీన్‌ల్యాండ్ పాఠశాలలో ఏపీ కన్నెగంటి హనుమంతు మెమోరియల్ స్పోర్ట్స్‌సొసైటీ ఆధ్వర్యంలో గురువారం కన్నెగంటి హనుమంతు వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హజరైన చక్రపాణి మాట్లాడుతూ దేశభక్తి, విలువలు,నిజాయితీ కన్నెగంటి సొంతమని, నేటి యువతకు ఆయన ఆదర్శ ప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ మండవ శ్రీనివాసరావు, సొసైటీ సభ్యులు టీ.నాగరాజు, సీహెచ్ సురేష్, నాగరాజు, పీ.వాసు, టీ.శ్రీనివాసరావు, పాఠశాల డైరక్టర్లు వై.రమాదేవి, వైఎస్ రాజు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోడల్ రైతుబజారులో
తాగునీటికీ కరువే..

● మూలనపడ్డ ఆర్వో వాటర్ ప్లాంట్.. మరమ్మతులకు డబ్బులేవ్!
● తాగునీటికి ఇబ్బంది పడుతున్న రైతులు, కొనుగోలుదారులు



ఏటీ అగ్రహారం,గుంటూరు(విద్య), ఫిబ్రవరి 22: రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కార్యాలయ ఆవరణలోని చుట్టుగుంట రైతు బజారు జిల్లాలోని అన్ని రైతు బజారులకు మోడల్‌గా ఉండాలన్న ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వంలో సకల వసతులను కల్పించారు. ముఖ్యంగా తాగునీటి ఏర్పాటుకోసం రైతుబజారు లోనే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. అప్పటి సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా



ఆర్వోప్లాంట్‌లో ధ్వసమైన స్విచ్‌బోర్డులు



ప్లాంట్ గదిలో కూరగాయల బాక్సులు, ఉండీ ఉపయోగం లేని కూలర్

చుట్టుగుంట రైతు బజారును ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం మారింది. రాష్ట్రానికే మోడల్‌గా ఉండాల్సిన చుట్టుగుంట రైతు బజారుపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది, నిర్వహణ దిగజారింది. పర్యవసానంగా అక్కడి రైతులకు, వచ్చే కొనుగోలుదారులకు కనీసం తాగునీరు కరువైంది. రైతుబజారులో ఏర్పాటుచేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ మూలన పడింది. వాటర్‌ప్లాంట్ మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎవ్వరూ పట్టించుకో లేదు. దీంతో బయటి నుంచి వాటర్ బాటిళ్లతో తాగునీరు కొనుగొలు చేయల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. తాగునీటి వాటర్ ప్లాంట్ విషయంపై రైతుబజారు ఏస్టేట్ ఆఫీసర్ పీ.లావణ్యను ప్రశ్నించగా ఆర్వోప్లాంట్ పనిచేయని విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

లారీ స్టాండ్ కోసం కృషి చేస్తా

● టీడీపీ తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ హామీ



మినీ లారీ స్టాండ్ యూనియన్ సభ్యులతో నసీర్, టీడీపీ నేతలు

గుంటూరు, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి):గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రత్యేకంగా లారీ స్టాండ్ ఏర్పాటు కోసం కృషి చేస్తానని టీడీపీ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ హామీ ఇచ్చారు. నల్లచెరువులో గల మినీ లారీ స్టాండ్ యూనియన్ అసోసియేషన్ వారితో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రవాణా వ్యవస్థ దెబ్బతిని పోయిందని ఆరోపించారు. అధిక భారాలు, పన్ను వసూళ్లతో ముఖ్యమంత్రి రవాణా రంగాన్ని దెబ్బతీశాడని, ముఖ్యంగా లారీలు నడుపుకునేవారి మీద ఈప్రభావం తీవ్రంగా పడిందని విమర్శించారు. డీజిల్ ధర పెరగడంతో లారీ యాజమాన్యం ఇబ్బందులకు గురవుతుందని, గతంలో చంద్రన్నబీమా పేరుతో డ్రైవర్లకు ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబాలను ఆదుకునే వారిని, ప్రస్తుతం జగన్‌రెడ్డి ఆ పథకాన్ని ఆపేసి వారిని అన్యాయం చేశాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలుగుదేశం పార్టీ వచ్చాక లారీస్టాండ్ సమస్యలు అన్నిటికీ పరిష్కారం చూపుతానని ఆయన భరోసా ఇచ్చారు. రానున్న ఎండాకాలం దృష్ట్యా లారీ స్టాండ్‌లో కూలింగ్ వాటర్ ఫ్రీజర్లను ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ వహీద్, మాల కొండయ్య, రవి, రాంబాబు, బ్రహ్మసాని శ్రీనివాసరావు, నరేంద్ర, జానీ మరియు మినీ లారీ అసోసియేషన్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.



ఫాతీమాకు పెళ్లి కానుక అందిస్తున్న ఉయ్యూరు ఫౌండేషన్ సభ్యులు

ఉయ్యూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో
'చంద్రన్న పెళ్లికానుక' అందజేత

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నేత ఉయ్యూరు శ్రీనివాస్ గురువారం ఓ పేదింటి ఆడబిడ్డకు 'చంద్రన్న పెళ్లి కానక'ను అందజేశారు. నియోజకవర్గంలోని నల్లచెరువు 20వ డివిజన్‌కు చెందిన షేక్ రఫీ కుమార్తె వివాహానికి 'ఉయ్యూరు ఫౌండేషన్' సభ్యులు వాసిరెడ్డి అప్పారావు, లంకా కిరణ్ కుమార్, ఏవీఎస్ రెడ్డి, సయ్యద్ ఆదామ్ షా, సయ్యద్ షరీఫుద్దీన్, పీ జమీర్‌లు హాజరై వధువు ఫాతిమాకు శ్రీనివాస్ పంపిన పెళ్లి కానుక చెక్‌ను అందజేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని పేద ఆడపిల్లలు 'చంద్రన్న పెళ్లి కానుక' కోసం దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన వారికి పెళ్లి కానుక అందజేస్తామని వారు తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగులపై చిన్నచూపు

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా

గుంటూరు(తూర్పు),ఫిబ్రవరి22: కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, రెండు నెలలుగా వారికి జీతాలను 10వ తేదీ తర్వాతే అందిస్తుందని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా మండిపడ్డారు. గురువారం మెడికల్ కళాశాల అవరణలో సంఘ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు నేటి వరకు జనవరి జీతాలు అందలేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం దృష్టిసారించి ఒకటో తారీకు జీతాలు ఇచ్చేలా కృషి చేయాలని, అలాగే కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ నేతలు విశ్వనాథ్, రాంబాబు, రవి కుమార్, ముత్యాల రావు, బషీర్ అహ్మద్, రాజశేకర్ పాల్గొన్నారు.

24న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 22: గుంటూరు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఈ నెల 24 వ తేదీన సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధ్యక్షతన జిల్లా పరిషత్ ఏసీ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరగనుంది. జిల్లాలోని ఎంపీడీవోలంతా సమీక్షా సమావేశానికి హాజరు కావాలంటూ జడ్పీ సీఈవో వసంతారాయుడు ఆదేశించారు.

వ్యాపార సంస్థలకు లైసెన్స్ తప్పనిసరి

● సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్ శ్రీనివాస్ కుమార్

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 22: వ్యాపార సంస్థలకు, దుకాణాలకు వ్యాపార లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్ శ్రీనివాస్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లెసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వ్యాపారులు విధిగా లెసెన్స్ తీసుకోవాలని, లైసెన్సు నమోదు ప్రక్రియ ఈ నెల 29 వ తేదీతో ముగుస్తుందని సంయుక్త కార్మిక కమిషనర్ సూచించారు.

టీడీపీ నేత సైదారావు ఆరోగ్యం విషమం

గుంటూరు, ఫిబ్రవరి 22 : టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కర్నాటి సైదారావు కిడ్నీ దెబ్బ తినడంతో నెల రోజులుగా ఆయన హైదరాబాదులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సైదారావు ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, సంఘం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్, మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య, టీడీపీ నేతలు డాక్టర్ కోడెల శివరాం తదితరులు ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా కోరారు.

ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు
నేడు పర్యావరణ విద్య పరీక్ష

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 22: ఈనెల 3న అనివార్య కారణంతో వాయిదాపడిన ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థుల పర్యావరణ విద్య పరీక్షను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐవో జీకే జుబేర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు తప్పని సరిగా పరీక్షకు హాజరయ్యేలా ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిఎడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

మహాప్రస్థానం అభివృద్ధికి విరాళం

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 22: స్థానిక బొంగరాలబీడులోని మహాప్రస్థానం అభివృద్ధికి దారపనేని చెన్నయ్య కుమారుడు చెన్నకేశవులు, వెంకటరమణమ్మ కుటుంబ సభ్యులు హరికృష్ణ ప్రసాద్ వనిజ, మనువడు మనుమరాలు రామ్ సాయి సొరిన్, అక్షిత తదితరులు రూ1,00116 చెక్కును కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. స్మశాన వాటిక అభివృద్ధి కొరకు దాతలు ముందుకు రావాలని కమిటీ సభ్యుడు కల్లూరు రమణయ్య తెలియజేశారు. కమిటీ సభ్యులు కూనల మాలకొండయ్య, చల్లా తిరుపతయ్య, జంగాలపల్లి పార్థసారథి, నిమ్మగడ్డ అంకమ్మ చౌదరి పాల్గొన్నారు

సేవాభావం పెంపొందించుకోవాలి

గుంటూరు(విద్య),ఫిబ్రవరి22: విద్యార్థులు సేవాభావం పెంపొందించుకోవాలని టెక్స్ బుక్స్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి సూచించారు. గురువారం లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో భారత్ స్కౌట్స్‌అండ్‌గైడ్స్ వ్యవస్థాపకుడు బెడెన్‌పోవల్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్జేడీ బీ.లింగేశ్వర్ రెడ్డి, పాఠశాల సలహాదారు జీ. వరప్రసాదరావు, ఎల్.కృష్ణవేణి, స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ వీ.శ్రీనివాసరావు, నజీర్, ఏడుకొండలు పాల్గొన్నారు

పాఠశాలల్లో ఉర్దూ డీఐ ఖాసిం తనిఖీ

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 22: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను గుంటూరు ఉర్దూ డీ.ఐ, ఎండీ ఖాసిం గురువారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు గ్రామస్థుల సహకారం అభినందనీయమన్నారు. పాఠశాల ఆవరణలో గ్రామస్థుల సహకారంతో రేకుల షెడ్డు నిర్మించడం అభినందనీయమని అన్నారు. పాఠశాలలో అమలుతున్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇర్షాద్ బేగ్, సమీనా అక్తర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి22: అంగన్‌వాడీల సమ్మె విరమణ సందర్భంగా చేసిన ఒప్పందం ప్రకారం సమ్మె కాలం జీతంతో సహా అన్ని జీవోలను వెంటనే విడుదల చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పీ.దీప్తి మనోజ కోరారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించి అనంతరం పీ డీ.ఉమాదేవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం దీప్తి మనోజ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఇంటర్వ్యూలలో ఎంపికైన హెల్పర్లుకు నియామక పత్రాలను అందజేయాలని, అలాగే కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీ.రాధా, షేక్ బాజీబీ, పద్మావతి, సులోచన, రోజమ్మ పద్మ, శివలీల ఉన్నారు.

కరెన్సీపై అంబేద్కర్ బొమ్మను ముద్రించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి22: భారత కరెన్సీ నోట్లపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని ముద్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని క్రైస్తవ ఐక్యవేదిక నాయకులు రాయపాటి మరియదాసు అన్నారు. ఈమేరకు గురువారం ఏసీ కళాశాల ఎదురుగావున్న అంబేద్కర్ భవన్‌లో ధర్నాకు సంబంధించిన పోస్టర్లును ఆయన ఆవిష్కరించారు. ఈ అంశాన్ని రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో పొందుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయపూడి చిన్నరాజు, ధారా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి22: స్థానిక రవీంద్ర నగర్ కంచి కామకోటి పీఠ హరిహర దత్తక్షేత్రం నందు శ్రీ రమా సత్యనారాయణ స్వామి వారి 47వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, విశేష స్నపన, స్వామివారిని పెళ్లికుమారునిచేసి అలంకరించారు. సాయంత్రం అంకురారోపణ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ చావలి గణపతి, ఉత్సవాల నిర్వహకులు రావిపాటి సత్యనారాయణ పర్యవేక్షించారు.



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కేజీ బేసిన్‌లో ఆంధ్రుల హక్కులపై
రాజకీయాలకు అతీతంగా ఉద్యమిద్దాం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 22: కృష్ణా, గోదావరి బేసిన్‌లో ఆంధ్రుల హక్కులపై రాజకీయాలకు అతీతంగా ఉద్యమం జరగాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ పిలుపునిచ్చారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. కేజీ బేసిన్‌లో గ్యాస్‌తో పాటు చమురు ఉత్పత్తి పెద్ద ఎత్తున జరుగుతుందని వాటి విలువ రూ.లక్షల కోట్లలో ఉంటుందని, దాని ద్వారా వచ్చే లాభాలలో ఏపీకి వాటా ఇవ్వాలని ఉద్యమం చేయాల్సిందేనని పునరుద్ఘాటించారు. 12వ ఆర్థిక సంఘం చెప్పిన విధంగా మన రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్, చమురు ఉత్పత్తిలో ఏపీకి 50 శాతం కేటాయించాలని అందుకు రాష్ట్ర ప్రజలంతా సమాయత్తం కావాలన్నారు. మేధావుల ఫోరం కార్యదర్శి చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ అండతోనే ఏపీలోని సహజ వనరులు రిలయన్స్ పాలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కేజీ బేసిన్ సాధనా సమితి కన్వీనర్ కొల్లా రాజమోహన్, మల్లికార్జునరావు , పీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

2024-25 జీఎంసీ వార్షిక బడ్జెట్‌పై సమావేశం

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 22: గుంటూరు నగర పాలక సంస్థ 2024-25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌పై మేయర్ అధ్యక్షతన, ఆయన ఛాంబర్‌లో గురువారం నగర పాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం జరిగింది. జీఎంసీ ఆదాయవ్యయాలు, బడ్జెట్ అంచనాలపై అధికారులతో చర్చించారు. మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరాభివృద్ధే ధ్యేయంగా 2024-25 నగర పాలక సంస్థ వార్షిక బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందని తెలియచేశారు. గుంటూరునగర పాలక సంస్థ ఆదాయం పెంపుదలకు, కొత్త ఆదాయ మార్గాల అన్వేషణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, నగర పాలక సంస్థకు వచ్చే ఆదాయంలో అధిక భాగం ఆస్తి పన్ను వసూళ్ల ద్వారా వస్తుందని తెలియచేశారు. 2024-25 సంవత్సరానికి రూపొందిస్తున్న బడ్జెట్ నగరాభివృద్ధికి దోహదపడేలా రూపొందించుట జరిగిందని, నగర పాలక సంస్థకు వచ్చే ఆదాయాలు, చేసే వ్యయాలతో వాస్తవిక అంచనాలతో అభివృద్దే ప్రధాన అజెండాగా బడ్జెట్ ఉంటుందని తెలియచేశారు. బడ్జెట్లో త్రాగునీరు, పారిశుధ్యం తో పాటు నగరంలో పచ్చదనం పెంపుకు,రోడ్ల విస్తరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్లు సి.హెచ్ శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య,ఈ.ఓ.ఎ నాగేంద్ర కుమార్,ఈ.ఈ సురేందర్ రెడ్డి, సి.పి ప్రదీప్ కుమార్, యం.హెచ్.ఓ మధుసూదనరావు,వివిధ విభాగా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

గౌతమినగర్ లో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, ఫిబ్రవరి 22 : స్థానిక అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతమి నగర్ 6/2 కు చెందిన కొండేపాటి శ్రీను (38) అనే వ్యక్తి గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌతమి నగర్‌కు చెందిన కొండేపాటి పిచ్చమ్మకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడు శ్రీను పేపర్ బైండింగ్ షాపులో పనిచేస్తూ ఉంటాడు. శ్రీనుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఆరు సంవత్సరాల వయసున్న పెద్ద కుమారుడికి తరచూ కడుపు నొప్పివస్తూ బాధపడుతూ ఉంటాడు. ఈ క్రమంలో ఆయనను చాలాకాలంగా ఆసుపత్రిలో చూపిస్తున్నారు. అయితే గురువారం కూడా మరోసారి తన కుమారుడికి కడుపునొప్పి రావడంతో భార్య ఆసుపత్రికి తీసుకెళ్ళింది. అయితే కుమారుడికి కడుపునొప్పి తగ్గకుండా తరచూ వస్తుండడంతో పాటు తాను బైండింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించలేని పరిస్థితుల్లో అనారోగ్యంతో ఉన్న కుమారుడిని చూపించడానికి ఇబ్బందిగా మారడంతో మనస్థాపానికి గురైన శ్రీను గురువారం మధ్యాహ్నం తన అక్క సుబ్బలక్ష్మికి ఫోన్ చేసి తాను చనిపోతున్నానని, మా పిల్లలను కూడా జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పాడు. వెంటనే ఆమె సమీపంలో ఉన్న తన తల్లికి ఫోన్ చేసి చెప్పడంతో తల్లి వెళ్లేసరికి ఇంటిలో ఉరివేసుకొని వేలాడుతున్నాడు. అదే సమయంలో ఆసుపత్రి నుంచి కుమారుడిని తీసుకొని ఇంటికి వచ్చిన భార్య శ్రీనును ఉరికి వేలాడకుండా పట్టుకునేందుకు ప్రయత్నించింది. ఇంతలో తల్లి అక్కడికి వచ్చి ఇరుగు పొరుగు వారిని పిలిచి ఉరితీసి శ్రీనుని కిందకు దించారు. అయితే అప్పటికే ఆయన కొన ఊపిరితో వున్న శ్రీను వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ శ్రీను మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మృతి చెందాడు. తల్లి పిచ్చమ్మ ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



టీడీ జనార్దన్ చేతుల మీదుగా సిబ్బందికి టీడీపీ హెల్మెట్స్ అందిస్తున్న రఘురామ్

హెల్మెట్ ధరించి ప్రాణాన్ని..
టీడీపీని గెలిపించి రాష్ట్రాన్ని కాపాడుకోండి

● రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నేతలకు హెల్మెట్స్ పంపిణీ చేస్తున్న అభిమాని

గుంటూరు, ఫిబ్రవరి 22 :'హెల్మెట్ ధరించి ప్రాణాన్ని, టీడీపీని గెలిపించి రాష్ట్రాన్ని కాపాడుకోండి' అనే నినాదంతో గుంటూరుకు చెందిన టీడీపీ అభిమాని జాలాది రఘురామ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా హెల్మెట్స్ పంపిణీ చేస్తున్నారు. ఇందుకుగాను ఆయన సంబంధిత కంపెనీతో చర్చించి ప్రత్యేకంగా రూపొందించిన హెల్మెట్స్‌ను అన్ని నియోజకవర్గాలకు పంపుతున్నారు. పసుపు రంగు కలిగి చంద్రబాబు, లోకేశ్‌ల ఫొటోలతో ఉండటమే ఈ హెల్మెట్ ప్రత్యేకత. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో పోటీచేయనున్న టీడీపీ అభ్యర్థులకు ఈ హెల్మెట్స్‌ను అందిస్తున్నారు. రానున్న ఎన్నికలు మండు వేసవిలో జరగనుండటంతో పాటు యువత ఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొనేందుకు, అంతేగాక అందరూ హెల్మెట్స్ ధరించి ఎన్నికల ప్రచారర్యాలీలో పాల్గొంటే ఆకర్షణీయంగా ఉంటుందనే ఉద్దేశంతో ఈ హెల్మెట్స్ పంపిణీకి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 15 వేల హెల్మెట్స్‌ను పంపిణీ చేయాలని ఆయన టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఇప్పటికే హిందూపురంతో పాటు గుంటూరు పశ్చిమ వంటి అనేక నియోజకవర్గాల్లో పంపిణీ చేశారు. అభ్యర్థులు ఖరారుకాని నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలకు అందిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలోని సిబ్బందికి, నాయకులు, కార్యకర్తలకు ఆయా హెల్మెట్స్ అందించారు. పార్టీ కార్యాలయ ఇన్‌చార్జ్ టీడీ జనార్దన్ చేతుల మీదుగా వాటిని సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీ జనార్దన్‌తో పాటు జాలాది రఘురామ్, పులివర్తి వెంకటేశ్వరరావు (అజార్) తదితరులు పాల్గొన్నారు. కేవలం పార్టీ మీద తనకున్న అభిమానంతో, పార్టీ గెలిచి అధికారంలోకి రావాలనే ఆకాంక్షతో తన వంతుగా హెల్మెట్స్ పంపిణీ చేస్తున్నట్లు రఘురామ్ తెలిపారు.

రుణాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు

● బ్యాంకు వద్ద పొదుపు సంఘాల మహిళల ధర్నా

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 22: గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారంకు చెందిన పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకు అధికారులు రుణాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆ సంఘాల్లోని మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గురువారం సదరు బ్యాంక్ వద్దకు వచ్చిన 70 పొదుపు సంఘాల మహిళలు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. తమకు ఇంతవరకు పావలా వడ్డీ, ఆసరా సొమ్ము అందలేదని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చిన మాఫీ సొమ్మును బ్యాంక్ మేనేజర్ పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రయివేటు ఇన్సూరెన్స్ లు చెయ్యనిదే రుణాలు మంజూరుచేయనని మేనేజర్ నేరుగా చెబుతున్నారని ఆరోపించారు. ప్రయివేట్ ఇన్సూరెన్స్ కోసం ఒక్కొక్క మహిళ వద్ద నుంచి రూ.15 వేలు ముందు గానే కట్టిస్తున్నారని వాపోయారు. తమ అనుమతి లేకుండానే పొదుపు సొమ్ము నుండి రూ.30 వేలు, రూ.40 వేలు కట్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రుణాలు పూర్తిగా చెల్లించినా బ్యాంకు అధికారులు కొత్త రుణాలు మంజూరు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

చెన్నైలో ఉండి బతికిపోయాడు

సంగీత దర్శకుడిపై డైరెక్టర్ ఫైర్



'సిద్ధార్థ్‌రాయ్' చిత్రం షూటింగ్ నిర్ణీత సమయంలోనే పూర్తి చేశాం. కానీ సంగీత దర్శకుడు రధన్ వల్ల పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యమైంది. అవుట్‌పుట్ విషయంలో నన్ను బాగా విసిగించాడు. తనతో చాలా విషయాల్లో వాగ్వివాదం జరిగింది. తను మంచి టెక్నీషియనే కానీ నన్ను మానసికంగా చిత్రవధ చేశాడు. చెన్నైలో ఉండి బతికిపోయాడు. లేకుంటే పెద్ద గొడవే జరిగేది. ఇలాంటి సంగీత దర్శకులకు దూరంగా ఉండాలి' అని దర్శకుడు వీ యశస్వి చిత్ర పరిశ్రమకు విజ్ఞప్తి చేశారు. ఆయన దర్శకత్వంలో దీపక్ సరోజ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన సంయుక్తంగా నిర్మించారు. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా యశస్వి మాట్లాడుతూ 'సుకుమార్‌గారికి ఈ సినిమా బాగా నచ్చి, 'నీ తర్వాత సినిమా నా బేనర్ లోనే చేస్తున్నాం' అని ప్రకటించారు. నేను ఊహించినదానికన్నా దీపక్ అద్భుతంగా నటించాడు. సిద్ధార్థ్‌రాయ్ ఒక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ఇలాంటి కథ, పాత్ర ఇప్పటివరకూ రాలేదు' అని అన్నారు. దీపక్ సరోజ్ మాట్లాడుతూ 'సిద్ధార్థ్‌రాయ్' కథ విన్నాక ఆనంద బాష్పాలు వచ్చాయి. నటుడిగా నన్ను నిరూపించుకోవచ్చని ఈ సినిమా చేశాను. ఈ సినిమా కోసం యశస్వి చాలా కష్టపడ్డారు. నా పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుందని నమ్ముతున్నాను' అని అన్నారు. ఇందులో తన పాత్ర చాలా ప్రత్యేకంగా ఉండబోతోందని కథానాయిక తన్వీ చెప్పారు.

నో లాజిక్ ఓన్లీ మ్యాజిక్

శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి కలయికలో వచ్చిన 'బ్రోచేవారెవరురా' చిత్రం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. ఇప్పుడు మరోసారి ఈ కాంబినేషన్ సెట్టయింది. ఈ చిత్రానికి 'ఓం భీమ్ బుష్' అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేశారు. 'నో లాజిక్ ఓన్లీ మ్యాజిక్' అనేది ఉపశీర్షిక. 'హుషారు' ఫేమ్ శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వంలో వీ సెల్యూలాయిడ్‌తో కలసి సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. యూవీ క్రియేషన్స్



సమర్పిస్తోంది. గురువారం మేకర్స్ ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసి, మార్చి 22న సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రీతీ ముకుందన్, అయేషాఖాన్ కథానాయికలు. ఈ చిత్రానికి సంగీతం: సన్నీ ఎంఆర్. సినిమాటోగ్రఫీ: రాజ్ తోట

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

అవినీతి, ఒత్తిళ్ల మధ్య నలుగుతున్న వైద్యులు

● డాక్టర్ల ఆత్మీయ సమావేశంలో టీడీపీ నేత డాక్టర్ పెమ్మసాని
● మూడు రాజధానులు అసాధ్యమంటూ వ్యాఖ్యలు


పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 22: తాను 20 ఏళ్లలో అమెరికాలో ఉన్నా తనను ఏ ఒక్కరూ లంచం అడగలేదని, కానీ ఎన్నో ఒత్తిళ్ళ మధ్య అవినీతి మధ్య నలిగిపోతున్న ఇక్కడి డాక్టర్లు ఆ ఒత్తిళ్లను అధిగమించి మరీ వైద్యం చేయడం నిజంగా అభినందనీయమని టీడీపీ నేత డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం నగరంలోని లక్ష్మీపురంలో స్థానిక వైద్యులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ఓవైపు ఆరోగ్యశ్రీ బిల్లులు కోట్లాది రూపాయలు పెండింగు పడుతున్నా, వైద్యం ఆపకుండా పనిచేస్తున్న ఇక్కడి వైద్యులకు నిజంగా చేతులెత్తి దండం పెట్టాలనిపిస్తుందన్నారు. ప్రస్తుత సమస్యలతో పాటు రాబోయే సమస్యలపైనా పోరాడడానికి తాను సిద్ధంగా ఉన్నాన్నారు. ప్రభుత్వం పనితీరు బాగోకపోతే పోరాడాలే కానీ, రాష్ట్రం వదిలి వెళ్ళిపోవాలనుకోవడం సమంజసం కాదన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చే తీర్పుపైనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, తమకు సాధ్యమైనంత త్వరగా ఆస్పత్రుల పరిశ్రమలు తీసుకొస్తామని స్పష్టం చేశారు. కేవలం ఓట్ల రాజకీయానికే కాని ఆచరణలో మూడు రాజధానులు అసాధ్యమని స్పష్టం చేశారు. జగన్‌తో పోలిస్తే పవన్‌కళ్యాణ్ వేలరెట్లు గొప్పవ్యక్తి అని కితాబిచ్చారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ.. ఇసుక, మద్యం, మైనింగ్‌తో పాటు చివరకు ఓటర్ల ఓట్లు కూడా తామే అమ్ముకుంటామని బెదిరించే నాయకుల మధ్యన మూగ జీవాలుగా తాము చూస్తుండి పోవాల్సివస్తోందని వాపోయారు. వైద్యులపై జరుగుతున్న దాడులు, ఎదురవుతున్న సమస్యలపై కేంద్రస్థాయిలో డాక్టర్ పెమ్మసాని ద్వారా చర్చలు జరగాలని వారు కోరారు. కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 22: మహాశివరాత్రి పర్వదినంను పురస్కరించుకొని శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోన్ మొత్తం మీద తెనాలి ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ ప్రథమస్థానంలో నిలవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

వైభవంగా పంచముఖ ఆంజనేయుని బ్రహ్మోత్సవాలు


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22: షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా గురువారం స్వామివారికి సూర్య ప్రభ, చంద్ర ప్రభ వాహన సేవలు నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు రఘురామ్, నాగమారుతీ, శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైదికక్రతువు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. సంకీర్తన బృందాల సభ్యులు కీర్తనలు ఆలపించారు. శుక్రవారం స్వామి వారి కళ్యాణం, శనివారం రథోత్సవం జరుగుతుందని ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు


ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 22: పట్టణంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ సేవలు దాతల సహకారంతో కొనసాగుతున్నాయని టీడీపీ నాయకులు, క్యాంటీన్ నిర్వాహక సభ్యుడు గోగినేని రమేష్ అన్నారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో, శివాజీ చౌక్‌లోని అన్న క్యాంటీన్‌లలో గురువారం చెరుకూరి దివ్యశ్రీ దశదిన కర్మ సందర్భంగా సోదరుడు గణేష్ సాయిరాం, కుటుంబ సభ్యుల సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సోమవరపు సాంబశివరావు, క్రొత్తపల్లి రమేష్, ముళ్ళపూడి వెంకట్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, వెల్లంకి సాంబయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విలేకరులపై దాడులు శోచనీయం

● హ్యూమన్ రైట్స్ కోస్తాంధ్ర అధ్యక్షుడు నాగరాజు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 22: ప్రజాస్వామ్య దేశంలో విలేకరులపై దాడులు శోచనీయమని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ముంబాయి) కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు అన్నారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో గురువారం నాగరాజు మాట్లాడుతూ అనంతపురం రాప్తాడు వైసీపీ పార్టీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని, ఇది మానవ హక్కుల ఉల్లంఘనేనని, దీనికి కారకులైన వారిని వదిలి పెట్టరాదని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారత దేశంలో ప్రతి ఒక్క పౌరుడికి భావ స్వాతంత్ర్యం ఉందని, ప్రశ్నించే హక్కు ఉందని అన్నారు. ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి విలేకరులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే రక్షణ చట్టాలను ఏర్పాటు చేయాలని, విలేకరుల ప్రాణాలకు భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చిట్టిబాబు, మాల్యాద్రి, కొడాలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గడిగుంటపాలెంలో వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ


భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పక్కన కమిటీ సభ్యులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని జగ్గడిగుంటపాలెం రామనామస్మరణలతో మారుమోగింది. గురువారం గ్రామంలోని శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి వార్ల మందిర పునఃప్రతిష్ఠా మహోత్సవం వేలాది మంది భక్తుల నడుమ, పండితుల వేదమంత్రాలతో అంగరంగ వైభవంగా జరిగింది. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గ్రామానికి విచ్చేసి స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామం నుంచే కాక పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామివార్లను దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తుల రామనామ స్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించి భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో వసతులు కల్పిస్తాం: అహ్మద్‌బేగ్

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22: బాలాజీరావుపేటలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పిస్తామని 33వ వార్డు కౌన్సిలర్ అహ్మద్ బేగ్ చెప్పారు. కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అవసరమైన టాయిలెట్స్ నిర్మాణాన్ని గురువారం చేపట్టారు. పట్టణంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను భవిత కేంద్రంలో చేర్పించి ప్రభుత్వ సౌకర్యాలు వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. సునీత, రజని, భూషణం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో వైసీపీని తిరిగి గెలిపించుకుందాం

● పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 22: ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంటూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమాన్ని అందించి ప్రజల మన్ననలు పొందిందని రాబోయే ఎన్నికల్లో తిరిగి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకుందామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. గురువారం పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో 17, 18, 32, 35, 36వ వార్డుల పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు చేపట్టవలసిన కార్యాచరణపై చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ కౌన్సిలర్లు, వార్డుల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, బూత్‌లెవెల్ ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి పాటుబడింది టీడీపీ మాత్రమే

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్


ఎస్సీ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 22: ఎస్సీ, ఎస్టీ సోదరుల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ పథకాలు అందించి వారి అభ్యున్నతికి పాటుబడిందని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని మారీసుపేట పెండ్యాల కల్యాణ మండపంలో ఎస్సీ సంఘీయులతో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు పాదయాత్రలో ప్రజలకు అనేక హామీలను ఇచ్చి, గద్దెనెక్కి నమ్మి ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచాడని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు గత ప్రభుత్వంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసి వారి అభ్యున్నతికి చంద్రబాబు పాటుబడితే జగన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ సంక్షేమ పథకాలను నిలిపివేసి అన్నివర్గాలపై మోయలేని భారాలు మోపుతూ పాలన చేశారని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో తాగునీరు, పక్కా రోడ్లు, డ్రైనేజ్‌లు, వీధి దీపాలు వంటివి ఏర్పాటు చేయడంతో పాటు పక్కా ఇల్లు నిర్మాణానికి కూడా నిధులు మంజూరుచేసిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదన్నారు. అదే కాలనీలకు జగన్ ఐదేళ్ల దగ్గరపడుతున్న పాలనలో కనీసం తాగునీళ్ల కూడా అందించలేకపోయారంటే ఇంతకంటే దారుణమైన పాలన మరొకటి ఉంటుందా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీల పిల్లలు ఉన్నత చదువులు చదువుకునేందుకు చంద్రబాబు తాపత్రయపడటంతో పాటు వారి బిడ్డలకు విదేశీ విద్యను చేరువచేసి వారి భవిష్యత్తుకు బంగారు బాటలువేస్తే జగన్ మాత్రం వాటన్నింటిని నిలుపుచేశారని ధ్వజమెత్తారు. సంక్షేమం అంటూ అన్నింటా ధరలు పెంచి సంక్షోభంలోకి ప్రజలను నెట్టారు.. ఇవన్నిటిని పక్కన పెట్టి సభల్లో మాత్రం నా ఎస్సీలు.. నా ఎస్టీలు.. నా బీసీలు.. నా మైనార్టీలు అంటూ జగన్ ఉపన్యాసం చేస్తారని విమర్శించారు. ప్రజలందరూ ఈ ప్రభుత్వ పోకడలను గమనించాలని జగన్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో పూర్తిస్థాయిలో పడగొట్టి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దామని ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డి.మంగయ్య, రమావత్ రాజానాయక్, బి.సతీష్, మహేష్‌నాయక్, జొన్నా శివయ్య, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అరాచకం తప్ప అభివృద్ధిలేదు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 22: జగన్ పాలనలో అరాచకం తప్ప అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. గురువారం పట్టణంలోని 8,9 వార్డుల టీడీపీ శ్రేణులతో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. న్యాయవాది, టీడీపీ సీనియర్ నాయకులు తాడిబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఒక్కఛాన్స్ అన్న జగన్ అధికారం చేపట్టిన తరువాత రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి పేదవాడి సంక్షేమం పేరుతో దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పనిచేశారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు తప్ప జగన్ ప్రభుత్వంలో రోడ్లు వేసిన దాఖలాలు కూడా లేవన్నారు. అధికారంలో ఉండి జగన్ నాలుగేళ్ల పాటు ప్రజల్లోకి రాలేదని ఎన్నికలు సమీపిస్తుండటంతో తిరిగి అధికారం చేజిక్కించుకునేందుకు సభలు పెట్టి హడావిడి చేస్తున్నారని అన్నారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం పనిచేసే పార్టీ ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనన్నారు. చంద్రబాబు వంటి సమర్థత కలిగిన నాయకుడు తిరిగి ముఖ్యమంత్రి అయితే తప్ప రాష్ట్రం బాగుపడదన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు పడ్డ ఇబ్బందులను గుర్తించిన చంద్రబాబు రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ కల్పిస్తూ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని వాటిని ప్రజలందరికీ తెలిపి రానున్న రోజుల్లో చంద్రబాబును గెలిపించుకుందామన్నారు. పిల్లి మాణిక్యాలరావు, తాడిబోయిన హరిప్రసాద్, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఐపీఎస్ అధికారి ఇంట్లో చోరీ

పెదకాకాని, ఫిబ్రవరి 22: పెదకాకాని పరిధిలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వెనుక విల్లాలో ఉంటున్న ఓ ఐపీఎస్ అధికారి ఇంట్లో చోరీ జరిగినట్లు గురువారం పెదకాకాని పోలీసులు గుర్తించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపీఎస్ అధికారుల బదిలీల్లో ఆయన రాయలసీమలోని ఓ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ అయ్యారు. ఇక్కడి నుంచి వెళ్లిన తర్వాత సామాన్లు అన్ని షిఫ్ట్ చేసేందుకు ప్యాక్ చేసి ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. సామాన్లు అంతా వెతికి చిందవందరగా పడేశారు. చోరీ జరిగిన విషయంపై పెదకాకాని పోలీసులకు సమాచారం రావటంతో క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌లను రంగంలోకి దించి తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

సీఎంఏ ఫలితాలలో శర్వాణికి 4వ ర్యాంకు


ప్రతిభ చూపిన విద్యార్థిని శర్వాణిని అభినందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22: సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంట్ పరీక్షా ఫలితాలలో తెనాలికి చెందిన ఇమ్మడి శర్వాణి ఆలిండియా స్థాయిలో 4వ ర్యాంకు సాధించారు. తల్లిదండ్రులు విశ్రాంత ఆంధ్రాబ్యాంకు మేనేజర్ గురునాథం, నాగదుర్గ, శర్వాణిని గురువారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందించారు. చార్టెట్ అకౌంటెంట్ రంగంలో ఉన్నత స్థాయికి చేరడం అరుదుగా ఉంటుందని అంతగొప్ప ర్యాంకు సాధించడం తెనాలికి గర్వకారణమన్నారు. స్థానిక చార్టెడ్ అకౌంటెంట్ రావూరి సుబ్బారావు వద్ద ఆర్టికల్స్‌తో పాటు సీఏ ఫైనల్‌లో సెకండ్ గ్రూప్ కూడా పూర్తిచేసింది. ప్రతిభచూపిన విద్యార్థినిని బ్రాహ్మణ పరిషత్ ప్రధాన కార్యదర్శి పురుషోత్తమశర్మ, ఆర్యవైశ్య సంఘ నాయకులు గురునాథ గుప్తా, శ్రీనివాసరావు, నరసింహమూర్తి, సురేష్‌లు అభినందించారు.

పోలీసులు చట్టానికి లోబడి పనిచేయాలి

● నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22: పోలీసులు చట్టానికి లోబడి పని చేయాలని, ఉన్నత అధికారులు కూడా ప్రజాస్వామ్యబద్ధంగా ఆదేశాలు ఇవ్వాలని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ, ప్రశాంతంగా నిర్వహించ తలపెట్టిన చలో సచివాలయం కార్యక్రమం పోలీసులు బలవంతంగా ఆపివేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని, ఈ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతు నొక్కే ప్రయత్నాలు చేయడం అందుకు పోలీసులు సహకారం అందించడం సరికాదన్నారు. ప్రభుత్వాధినేత చెప్పినట్టుగా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడం వాటిని కిందిస్థాయిలో కూడా అమలుచేయడం చూస్తుంటే ఈ రాష్ట్రం ఎటు పోతుందోనని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నెహ్రూనికేతన్ స్కూల్‌లో కవలల దినోత్సవం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22: బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో గురువారం అంతర్జాతీయ కవలల దినోత్సవం నిర్వహించారు. స్కూల్‌లో చదువుతున్న 10జతల కవల పిల్లల్లో పాఠశాలకు 8జతల పిల్లలు హాజరయ్యారు. ప్రతి జత ఓ ప్రత్యేక డ్రెస్ ధరించి హాజరయ్యారు. వారందరికీ గులాబీ పూలు అందించి ఎండీ మురళీకాంత్ అభినందించారు. ఎక్కువ మంది కవలల జతలు తమ పాఠశాలలో చదవడం ఆనందంగా ఉందని వారందరిని ఒకేమారు స్కూల్ పిల్లలంతా చూడటం మధురానుభూతిని అందించిందని తెలిపారు.

వీవీఐటీ డ్రైవర్‌కు ఉత్తమ అవార్డు


డ్రైవర్ శ్రీనివాసరావును అభినందిస్తున్న విద్యాసాగర్

పెదకాకాని, ఫిబ్రవరి 22: 35వ రోడ్డు భద్రతా మాసోత్సవాలు కార్యక్రమం ముగింపు వేడుకలలో వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన డ్రైవర్ మాడా శ్రీనివాసరావు ఉత్తమ డ్రైవర్ పురస్కారం అందుకున్నారు. గుంటూరు రవాణాశాఖ అధికారుల నుంచి ఈ అవార్డు అందుకున్నట్లు వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గురువారం తెలిపారు. గత 16 సంవత్సరాలుగా వీవీఐటీ కళాశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు అప్రమత్తంగా విద్యార్థులను సురక్షితంగా చేరవేసినందుకు నేషనల్ హైవేస్ అథారిటీ పీడీ పార్వతీశం, రవాణా శాఖ ప్రాంతీ య సంయుక్త కమిషనర్ కృష్ణవేణి, గుంటూరు రవాణాశాఖ ఉపకమీషనర్ షేక్ కరీంల నుంచి పురస్కారం అందుకున్నారన్నారు. శ్రీనివాసరావ ును కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ కన్వీనర్ సురేందర్‌మోహన్, ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది అభినందించారు.

ప్రజల కోసమే ఆరోగ్య సురక్షా శిబిరం: ఎంహెచ్‌వో హెలెన్ నిర్మల

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 22: ప్రజల కోసమే ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కారుమూరు హెలెన్ నిర్మల అన్నారు. స్థానిక మారీసుపేట మఠంబజార్ అంగన్వాడీ సెంటర్‌లో గురువారం రెండవ విడత ఆరోగ్య సురక్షా శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డాక్టర్లు వి.దేవికావాణి, రూపేష్‌కిరణ్, వి.శేషగిరిరావు పాల్గొని జనరల్ ఓపీ 115మంది, ఆర్థోపెడిక్ ఓపీ 60మంది, ఆప్తోమెట్రీషియన్ ఓపీ 72, జనరల్ మెడిసిన్ ఓపీ 76 మందిని పరీక్షించి మందులిచ్చారు.

చేబ్రోలులో పలువురికి నరేంద్ర పరామర్శ


చేబ్రోలు రామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న నరేంద్ర కుమార్

చేబ్రోలు, ఫిబ్రవరి 22: చేబ్రోలులో మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గురువారం పర్యటించి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. చేబ్రోలులో రజక సంఘం ఆధ్వర్యంలో పునఃనిర్మితమైన కోదండ రామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకులు, వుయ్యూరు రాము, సాయి బాబా గృహాలకు వెళ్లి వారిని పరామర్శించారు. అలాగే ఇటీవల మరణించిన షేక్ జిలాని, డి శ్రీకాంత్ గృహాలకు వెళ్లి మృతులకు నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను నరేంద్రకుమార్ పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. పొన్నూరు మండలం వెల్లలూరులో ఇటీవల మరణించిన కుమ్మల రావమ్మ గృహానికి వెళ్లి రావమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. రావమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


వధువుకు పెండ్లికానుకను అందిస్తున్న టీడీపీ శ్రేణులు

ఆలపాటి పెండ్లికానుక అందజేత

తెనాలి రూరల్, ఫిబ్రవరి 22: వివాహ వేడుకల్లో కుటుంబసభ్యుడిగా తోడ్పాటునందించాలన్న సంకల్పంతో ఆలపాటి పెండ్లికానుకను అందిస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ వేమూరి శేషగిరిరావు అన్నారు. గురువారం పట్టణంలోని 17వ వార్డులో షేక్ జానీ, హసీనా దంపతుల కుమార్తె సానియా వివాహాన్ని, పట్టణంలోని 7వ వార్డులో షేక్ సుభాని, సాహిదా దంపతుల కుమార్తె బాజీబీ వివాహాన్ని పురస్కరించుకుని ఆలపాటి బంగారు ఉంగరం, చీర, గాజులను పార్టీ శ్రేణులతో కలిసి శేషగిరిరావు వధువుకు అందించి ఆశీస్సులందించారు.


బహుమతులు అందుకున్న ప్లంబర్లతో శేషుకుమార్, సాయి స్వరూప్ తదితరులు

వృత్తిలో నిబద్ధత కలిగి ఉండాలి

● అరుణ జ్యోతి డిస్ట్రిబ్యూటర్స్ అధినేత శేషుకుమార్

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 22: ప్లంబర్లు వృత్తిలో నిబద్ధత కలిగి ఉండాలని అరుణ జ్యోతి డిస్ట్రిబ్యూటర్స్ అధినేత కొత్త శేషుకుమార్ అన్నారు. స్థానిక సుల్తానాబాదులోని కుమార్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ప్రాంగణంలో స్పర్శ్ పెరల్ మెగా ప్లంబర్ మీట్‌ను నిర్వహించారు. అరుణ జ్యోతి డిస్ట్రిబ్యూటర్స్ అధినేత కొత్త శేషుకుమార్, ఏపీ ఇన్‌చార్జ్ సాయి స్వరూప్ ఆధ్వర్యంలో ఈ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా శేషుకుమార్ మాట్లాడుతూ ప్లంబర్లు కాలానుగుణంగా నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. సాయి స్వరూప్ ప్లంబర్లకు డెమోను నిర్వహించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం వారికి బహుమతులందించారు. కార్యక్రమంలో కుమార్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

'అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలపై జీవో ఇవ్వాలి'

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22: సమ్మెచేసిన అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీపై చర్యలేవని సీఐటీయూ జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్ ప్రశ్నించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా గురువారం మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ చేశారు. హామీలు ఇచ్చి సమ్మె విరమింపజేసి నెలరోజులు అవుతున్నప్పటికీ ఒప్పందం అమలుకోసం ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మంత్రివర్గ ఉపసంఘం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్లక్ష్యం వీడి హామీలపై చర్యలు చేపట్టాలన్నారు. సంఘ నాయకులు షేక్ హుస్సేన్‌వలి, కుమారి, హసీనా, లావణ్య, జయలక్ష్మి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి కోసం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నిడుబ్రోలు మహిళలు

తాగునీటి కోసం మహిళల నిరసన

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 22: పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలులో తాగునీటి సమస్యలపై బుధవారం మహిళలు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నిడుబ్రోలులోని 8, 9, 11, 12 వార్డులో తాగునీరు మూడు రోజులకు ఒకసారి మాత్రమే వస్తుందని మహిళలు ఆరోపిస్తున్నారు. అదికూడా మూడు రోజులకు ఒకసారి ఒక గంట మాత్రమే విడుదల చేస్తున్నారని ఈ నీరు తాగటానికి సరిపోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిడుబ్రోలులో తమ సమీపానే 100 ఎకరాల సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ ఉన్నప్పటికీ తమకు తాగునీటి సమస్యలు పట్టడం లేదని మహిళలు వాపోయారు. వార్డులో మురుగునీటి సమస్య, దోమలు, కుక్కల బెడదతో ఇబ్బందులకు గురవుతున్నామని, తమ మొర ఆలకించేవారే కరువయ్యారని వాపోయారు. మహిళల నిరసన సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ మహిళలను పిలిపించి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిరసనలో నిడుబ్రోలుకు చెందిన మహిళలు పాల్గొన్నారు.


మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 22: స్వతంత్ర సమరయోధుడు దేశ తొలి విద్యాశాఖ మంత్రి డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని గురువారం తెలుగుదేశం పార్టీ కార్యలయంలో నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆజాద్ చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆజాద్ స్వతంత్ర్య పోరాటంలో దేశానికి చేసిన సేవలను మననం చేసుకున్నారు. తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యాభివృద్ధికి ఆజాద్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ, మండల టీడీపీ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబురావు, ఆకుల సాంబశివరావు, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, పఠాన్ ఫైరోజ్‌ఖాన్, టి.లక్ష్మీనారాయణ చౌదరి, ఫైజుల్లాఖాన్, షేక్ బాజీసాహెబ్, లాడెన్, కరిముల్లా బాజీ, సుభానీ, భానుమూర్తి, జానీబేగ్, దాసరి విజయ్, ఇస్మాయిల్, అబ్దుల్లా, సమీర్ తదితరులు పాల్గొన్నారు.



సీడీపీవోకు వినతిపత్రం అందచేస్తున్న అంగన్‌వాడీలు

సమ్మెకాలపు ఒప్పందాలు అమలుచేయాలి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 22: అంగన్‌వాడీలతో సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని అంగన్‌వాడీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు నిమ్మకూరి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో సీడీపీవో వెంకటరమణకు అంగన్‌వాడీలు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ 42రోజులు సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేసినట్లు చెప్పారు. సమ్మె కాలంలో ప్రభుత్వం తమతో ఒప్పందాలు చేసుకొని నెల గడుస్తున్నా నేటివరకు సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాల అమలు జరపలేదని ఆరోపించారు. తక్షణమే సమస్యల పరిష్కార జీవోలు ఇవ్వాలని త్రైమాసిక కమిటీ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంవీ సుకన్య, డి.పద్మజ, విజయలక్ష్మి, అనూరాధా, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళల సాధికారత కోసం స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు

● గైడ్ కెప్టెన్ జాగర్లమూడి ఉమాదేవి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 22: మహిళల సాధికారత కోసం స్కౌట్స్ అండ్ గైడ్స్ కృషి చేస్తుందని గైడ్ కెప్టెన్ జాగర్లమూడి ఉమాదేవి అన్నారు. మండల పరిధిలోని చింతలపూడిలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం వరల్డ్ థింకింగ్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సేవలందించిన బైడెన్ పావెల్, సోమ్స్ పావెల్ జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం ఫిబ్రవరి 22వ తేదీన ప్రతి ఏడాది వరల్డ్ అసియేషన్ ఆఫ్ గరల్స్ గైడ్, గరల్స్ స్కౌట్స్ కార్యక్రమాన్ని 150కిపైగా దేశాలో 10మిలియన్ బాలికల కోసం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిధులు సేకరించి మహిళా సాధికారతను పెంపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలైన బాలికలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్‌టీ సాయి ఆధ్వర్యంలో బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలపై జీవో ఇవ్వాలి

● సీఐటీయూ మండల అధ్యక్షుడు కోటా చంద్రశేఖర్


కొల్లిపరలో నిరసన ప్రదర్శన చేస్తున్న అంగన్‌వాడీలు

కొల్లిపర, ఫిబ్రవరి 22: అంగన్‌వాడీలు సమ్మె విరమించి నెలరోజులు పూర్తి అయ్యిందని సమ్మె విరమణ ఒప్పందంలో భాగంగా అంగీకరించిన అంశాలపై ప్రభుత్వం తక్షణమే జీవోను విడుదల చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు కోటా చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపరలో అంగన్‌వాడీలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ పేదకుటుంబాల పిల్లలకు అంగన్‌వాడీలు కీలకపాత్ర పోషిస్తున్నారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులకు జీవోను వెంటనే విడుదల చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ మండలస్థాయి నాయకులు డి.శివపార్వతి, ఆదిలక్ష్మి, గుంటూరు స్వర్ణలత, దీప్తి, శ్రీలక్ష్మి, సువర్ణలత, మాధవి తదితరులు పాల్గొన్నారు.